నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | బుధవారం 15-7-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 301 | పేజీలు: 4 | వెల: రూ.1/-

కరోనాపై బీజేపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్,జులై 14: తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ చేస్తున్న అసత్య ప్రచారాలు, ఆరోపణలు మానుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సూచించారు. కరోనాపై తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందనడాన్ని ఆయన ఖండించారు. ఆ ఆరోపణలు అసత్యమని, నిరాధారమని కొట్టిపారేశారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో రైతు వేదికలకు రాష్ట్ర గిరిజన సంక్షేమం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన జనగామ జిల్లా కొడకండ్లలో మాట్లాడారు. కరోనాపై అందరికంటే ముందే అప్రమత్తమైన ప్రభుత్వం తెలంగాణ అన్నారు.

సీఎం కేసీఆర్ అందరికంటే ముందుగానే, లాక్‌డౌన్ విధించారని, ఆ తర్వాతనే బీజేపీ ప్రభుత్వం స్పందించిన సంగతి మరచిపోవద్దన్నారు. కరోనా వైరస్ ప్రపంచమంతా వ్యాపించిందని, దేశంలోనూ ఉందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కరోనా లేదా? అక్కడ మీరెందుకు అదుపు చేయలేకపోతున్నారని ప్రశ్నించారు. కరోనా వైరస్‌కి మందు లేదని, టీకాలు రాలేదని బీజేపీకి, ఆరోపణలు చేస్తున్న ఆ పార్టీ నేతలకు తెలియదా? అని మంత్రి ప్రశ్నించారు. మొదట మీరెందుకు కరోనా వైరస్‌ను అదుపు చేయలేకపోతున్నారో ప్రజలకు చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

గత ఐదేళ్లుగా తెలంగాణ సీఎం కేసీఆర్ ఉపాధి హామీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని కోరుతున్నారు. మీరు ఏమాత్రం స్పందించడం లేదు. కూలీలకు మరింత ఉపాధి కల్పించడంతోపాటు, రైతాంగాన్ని ఆదుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను మీరెందుకు నెరవేర్చడం లేదని మంత్రి ఎర్రబెల్లి బీజేపీ నేతలను ప్రశ్నించారు. విమర్శలు మానుకుని రైతులకు మేలు చేసే ఆలోచనలు చేయాలని హితవు పలికారు.

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జన్నార్‌కు ఆక్సిమీటర్లను అందచేసిన విజన్ మోబైల్ స్టోర్స్ ప్రతినిధులు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా సేవలు

మున్సిపాలిటీల్లో ఖాళీలపై కెటిఆర్ సమీక్ష

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీల్లో ఖాళీల భర్తీపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ప్రజలకు సౌకర్యవంతమైన చర్యలు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నూతన పురపాలక చట్టం విధివిధానల మేరకు ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించాలన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ, ప్రజలను దృష్టిలో పెట్టుకుని సిబ్బంది అవసరం ఎక్కువగా ఉండే నేపథ్యంలో ఖాళీల భర్తీపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పట్టణదారుల అవసరాల మేరకు సిబ్బందిని కేటాయించనున్నట్లు తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు రచించాలని అధికారులకు సూచించారు. ఇంజనీరింగ్, ఇన్‌ఫా విభాగాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో మంత్రి కేటీఆర్ మున్సిపాలిటీల్లో ఖాళీల భర్తీపై సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

చనిపోయినాక మహిళలకు కరోనా నిర్ధారణ

ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు

రంగారెడ్డి,జూలై 14(ఆర్ఎన్ఎ): ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన విజయిబాయి అనే మహిళ అనారోగ్యం తో మృతి చెందింది. అయితే చనిపోయి అంత్యక్రియలు అయిన 5 రోజులకు ఆమె కరోనాతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మొదట అనారోగ్యంతో భాద పడుతుండడం తో మహిళకు ఈ నెల 8 తేదీన చార్మినార్ వద్ద కోవిడ్ టెస్ట్ చేయించారు కుటుంబ సభ్యులు. అదే రోజు రాత్రి సమయంలో ఆరోగ్యం క్షీణించడంతో మలక్‌పెట్ యశోద ఆసుపత్రికి తరలించారు. అయితే అక్కడ యశోద , బంజారాహిల్స్ లోని విరించి వైద్యులు వైద్యం చేయడానికి నిరాకరించారు. చివరకు ఆ మహిళను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు బందువులు. అయితే అప్పటికే ఆరోగ్యం క్షీణించడం ఆ మహిళ మృతి చెందింది. ఆ తర్వాత మృత దేహానికి కరోనా టెస్ట్ చేయాలని బందువులు కోరగా, అనారోగ్య కారణంగా మృతి చెందింది, కరోనా లేదు అంటూ మృతి దేహాన్ని కుటుంబం సభ్యులకు అప్పగించారు గాంధీ వైద్యులు. దాంతో మృతురాలుకు కుటుంబ సభ్యులు, బందువులు, స్థానికులు కలిసి అంత్యక్రియలు నిర్వాహించారు. ఆ తర్వాత 5 రోజులకి మొదట చార్మినార్ వద్ద కరోన టెస్ట్ కు శాంపిల్ ఇచ్చిన రిపోర్టులో పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారించారు. ఇక ఆ విషయం తెలిసిన తర్వాత అంత్యక్రియలు పాల్గొన్న బంధువులు, గ్రామస్థులు భయాందోళనలకు గురవుతున్నారు. గాంధీ వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఇలా జరిగింది అని ఆరోపిస్తున్నారు.

గాంధీ ఆస్పత్రి ముందు కొనసాగుతున్న ఔట్‌సోర్సింగ్ నర్సుల ఆందోళన

ఐదోరోజుకు చేరుకున్న గాంధీ నర్సుల ఆందోళన

సరైనజీతాలు, ఉద్యోగ భద్రత లేకుండా పోయింది
కరోనా డ్యూటీలో ఉన్నా తమను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన
సిఎం కెసిఆర్ నేరుగా స్పందించాలని వినతి
కిందిస్థాయి ఉద్యోగుల విధుల బహిష్కరణతో గాంధీలో ఆందోళన

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): వెట్టి చాకిరీ నుండి విముక్తి కల్పించాలని.. తమ ఉద్యోగాలకు భద్రత కల్పించి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ.. గాంధీ హాస్పిటల్ ఔట్ సోర్సింగ్ నర్సుల సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. సిఎం కెసిఆర్ స్వయంగా తమ దీనస్థితిని గుర్తించి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. కరోనా పేషెంట్ల రోణలో పాటుపడుతున్న తమను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. మంగళవారం ఉదయం డ్యూటీకి వచ్చిన వెంటనే వారంతా మూకుమ్మడిగా విధులను బహిష్కరించి మళ్లీ ఆందోళనకు దిగారు. సామాజిక దూరం పాటిస్తూ.. గ్రౌండ్‌లో బైఠాయించి ప్రజాస్వామ్య బద్దంగా నిరసన నినాదాలతో తమ ఆవేదన తెలియజేశారు. శ్రమ దోపిడీ.. నశించాలి.. అవుట్ సోర్సింగ్ నర్సులను వెంటనే పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలంటూ నినదించారు. దాదాపు 14 ఏళ్లగా పనిచేస్తున్నా తమకు ఎలాంటి ఉద్యోగానికి భద్రత కల్పించకపోవడం సమంజసం కాదన్నారు. కొత్తగా చేరిన వారికి 25వేల జీతాలు ఇస్తూ తమకు మాత్రం 12,13వేల జీతాలు ఇస్తున్నారని ఆవేదన చెందారు. తమకు సంసారాలు ఉన్నాయని, ఇళ్లకు రెంట్లు కట్టుకోవాలని మహిళలు కన్నీర్లుగా పనిచేస్తున్న తమకు ఇప్పటికీ 15వేలే పెట్టుకున్నారు. ప్రాణాంతక కరోనా మహమ్మారి విజృంభిస్తున్న ఈ సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నా.. ఉద్యోగ భద్రత.. కనీస వేతనాలు? కల్పించే ఆలోచన గాని.. ప్రయత్నం గాని చేయడం లేదన్నారు. తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని ఏడేండ్ల నుంచి ప్రజాస్వామ్య బద్దంగా పోరాడుతున్నామని.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన వెంటనే తమకు న్యాయం జరుగుతుందని, తమ బతుకులు బాగుపడతాయని ఆశిస్తే.. పోయిందన్నారు. కరోనా స్టాఫ్ నర్సుల రిక్రూట్‌లో సినియార్టీ లేనివారికి రూ.28వేల రూపాయలు జీతాలుగా చెల్లిస్తూ? 14 ఏళు గా పనిచేస్తున్న తమకు ఇప్పటికీ 15వేలే ఇస్తుండడం సరికాదన్నారు. చాలీ చాలని వేతనాలతో కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని.. పులిమీద పుట్రలా కరోనా డ్యూటీ చేస్తున్నామని గుర్తించి ఇంటి ఓనర్లు తమను ఇళ్లు ఖాళీ చేసి వెళ్లిపోమంటున్నారని కన్నీరు పెట్టుకుని విలపించారు. ఏపీలో మాదిరిగా తమకు కూడా 35 వేల వేతనం ఇచ్చి న్యాయం చేయాలని గాంధీ నర్సులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో సిఎం కెసిఆర్ స్వయంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. తమను సానుభూతితో అర్థం చేసుకోవాలన్నారు. మరోవైపు గాంధీ ఆస్పత్రి సిబ్బంది ఒక్కొక్కరు ఆందోళన బాట పడుతున్నారు. ఇప్పటికే తమను రెగ్యులరైజ్ చేయాలని అవుట్ సోర్సింగ్ నర్సులు డ్యూటీలకు హాజరు కావడం లేదు. మరోవైపు నాల్గవ తరగతి ఉద్యోగులు మంగళవారం నుంచి ఆందోళన బాట పట్టారు. అయితే కొత్తగా తీసుకునే వాళ్లకు ఎక్కువ జీతం ఇవ్వటంతో.. తమకు జీతాలు పెంచాలంటూ నాలుగు రోజులుగా నర్సులు ఆందోళన బాట పట్టారు.

ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపినా ఫలితం లేకుండా పోయింది. జీతాలు పెంచుతామని హామీ ఇచ్చినా, 14 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతున్నారు. నాల్గవ తరగతి ఉద్యోగులు, స్వీపర్లు, వార్డు బాయ్‌లు, ఆయాలు ఆందోళన చేయనున్నట్లు ప్రకటించటంతో గాంధీలో గందరగోళం నెలకొంది. కరోనా రోగులు చికిత్స పొందుతున్న పరిస్థితుల్లో అందరూ విధులు బహిష్కరించి ఆందోళన చేస్తే రోగులకే ప్రమాదంగా మారే అవకాశం ఉంది.

రేపటి నుంచి శ్రీశైలం ఆలయం మూసివేత

త్తూరు, జులై 14: చిత్తూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం ఆలయాన్ని బుధవారం నుంచి మూసివేయనున్నారు. వారం రోజుల పాటు ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. ఆలయానికి చెందిన ఇద్దరు పరిచారికలు, ముగ్గురు సెక్యూరిటీ సిబ్బందికి కరోనా నిర్ధారణ కావడంతో ఆలయ మూసివేత నిర్ణయాన్ని తీసుకున్నారు.

దేవాదాయశాఖ కమిషనర్ దర్శనాల నిలిపివేతకు ఆలయ ఈవో నిర్ణయాన్ని ప్రకటించారు. అయితే స్వామి, అమ్మవార్లకు నిత్యకైంకర్యాలు, ఇతర సేవలు యథాత నిర్వహిస్తామని ఈవో వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో కరోనా రోజురోజుకూ పెరిగిపోతుందడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలో గడిచిన 24 గంటల్లో 238మందికి కరోనా సోకగా ఆ సంఖ్య 3074కు చేరుకుంది. 1809మంది బాధితులు ఆస్పత్రుల్లో చికిత్సపొందుతుండగా 1236 మంది డిశ్చార్జి అయ్యారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 29 మంది కరోనా బారిన పడి మృతి చెందారు.

డిస్కవరీ ఛానల్ యాంకర్ మృతి

వాషింగ్టన్,జూలై 14(ఆర్ఎన్ఎ): డిస్కవరీ చానల్‌లో ప్రముఖ షో 'మిత్‌బస్టర్స్' యాంకర్ గ్రాంట్ ఇమహారా(49) మంగళవారం కన్నుమూశారు. ఈ విషయాన్ని డిస్కవరీ ప్రతినిధి ఒక ప్రకటనలో వెల్లడించారు. 'గ్రాంట్ మరణం విచారకరం. అతడు మా డిస్కవరీ కుటుంబంలో ముఖ్యమైనవాడు. అతడు చాలా అద్భుతమైన వ్యక్తి. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం.' అని పేర్కొన్నారు.కాగా, ఇమహారా ఆకస్మిక మృతికి కారణాలు తెలియలేదు. అతడు 'మిత్ బస్టర్స్' ప్రోగ్రాంకు యాంకరింగ్ చేశాడు. అలాగే, ప్రదర్శనలో ప్రయోగాల సమయంలో అవసరమైన రోబోలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను తయారు చేయడంలో అతడు ప్రసిద్ధి చెందాడు. అతడు ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్ 'వైట్ రాబిట్ ప్రాజెక్ట్'లో హోస్ట్‌గా చేరారు. 'డ్రంక్ హిస్టరీ', 'షార్క్‌నాడో 3', మార్వెల్ యానిమేటెడ్ సిరీస్ 'ఎవెంజర్స్ అస్సెంబుల్' లాంటి షోల్లో కూడా అతడు కనిపించాడు.

కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): నగరంలోని గోపాన్‌పల్లి తండాలో విషాదం నెలకొంది. కుటుంబ కలహాలతో గృహిణి ఆత్మహత్య చేసుకుంది. ఓ అపార్టుమెంట్‌లో నివశిస్తున్న కంకణాల స్రవంతి ఒంటికి నిప్పంటించుకుని బలన్మరణం చెందింది. భర్త సంతోష్, అత్తా, మామల వేధింపులే స్రవంతి ఆత్మహత్యకు కారణమని ఆమె కుంటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. స్రవంతికి సంతోష్ కుమార్‌తో 2017లో వివాహం జరిగింది. వారికి రెండేళ్ల బాబు ఉన్నాడు. గత రాత్రి కూడా భర్త సంతోష్, అత్తామామలతో గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన మహిళ మంగళవారం తెల్లవారుజామున ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పండింది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతులను ఆదుకోవడానికి అనేక పథకాలు

దేశంలో ఎక్కడా లేని విధంగా కార్యక్రమాలు
మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

జనగామ,జూలై 14(ఆర్ఎన్ఎ): రైతులను ఆదుకుని వారికి అండగా నిలవడానికి సిఎం కెసిఆర్ అనేక పథకాలు ప్రవేశ పెట్టారని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ అన్నారు. దేశంమొత్తం మీద తెలంగాణలో మాత్రమే రైతు సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. కొడకండ్ల, రామారంలో మంగళవారం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ రైతు వేదికల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ కష్ట కాలంలోనూ రైతుబంధు పథకం ద్వారా సాయం అందించిన ప్రభుత్వం ఒక్క తెలంగాణ మాత్రమే అని అన్నారు. రైతు వేదికలకు రాష్ట్ర వ్యాప్తంగా శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు. కరోనా వైరస్ వ్యాపించకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరు రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవాలని మంత్రి అన్నారు. రైతుల సంక్షేమం కోసమే నూతన వ్యవసాయ విధానాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. రైతులకు సాగు నీరు, పెట్టుబడి అందిస్తున్నా, ధర విషయంలో దెబ్బతింటున్నారన్నారు. మార్కెట్, భూసారాన్ని అనుసరించి పంటలు సాగు చేస్తే రైతులకు లాభం ఉంటుందని, అందుకే నూతన వ్యవసాయ విధానాన్ని సీఎం కేసీఆర్ రాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి పలు అమలుచేస్తున్నారని తెలిపారు. దేశంలో ఎవరూ చేయని విధంగా రైతుల అవసరాలు తీర్చేందుకు ముఖ్యమంత్రి పలు పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. నియంత్రిత సాగు విధానంతో రైతులు ప్రయోజనాలు పొంది ఆర్థికంగా పరిపుష్టి చెందుతారన్నారు. రైతులు ఐక్యంగా ఉండేందుకు వేదికలు దోహదం చేస్తాయన్నారు. సకాలంలో రైతువేదిక నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లా కొడకండ్ల, రామారంలో మంగళవారం రైతు వేదికల నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్

అమెరికా యుద్ధనౌకలో మంటలు

న్యూఢిల్లీ,జూలై14(ఆర్ఎన్ఎ): అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ బాన్‌హోమి రిచర్డ్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఆదివారం ఆ భారీ షిప్‌లో ఉన్న కార్గోలో మంటలు వ్యాపించాయి. సాన్ డియాగో నౌకాశ్రయంలో ఉన్న యుద్ధనౌకలో పేలుడు జరిగినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 60 మంది గాయపడినట్లు తెలుస్తోంది. యుద్ధనౌకలో చెలరేగుతున్న మంటల్ని ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది రెండు రోజుల నుంచి ప్రయత్నిస్తూనే ఉన్నది. అమెరికా నౌకాదళంలో ఈ యుద్ధనౌకను సెకండ్ ర్యాంక్‌తో పోలుస్తారు. యూఎస్ఎస్ బాన్‌హోమి రిచర్డ్ పొడుగు 257 మీటర్లు. రెగ్యులర్ మెయిన్‌టేనెన్స్ కోసం దీన్ని సాన్ డియాగో షిప్‌యార్డ్‌లో ఆపారు. ఆ సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదం సమయంలో షిప్‌లో కేవలం 160 మంది మాత్రమే ఉన్నట్లు అధికారులు చెప్పారు. సాధారణంగా ఆ యుద్ధనౌకలో వెయ్యి మంది సిబ్బంది ఉంటారు.

మెట్రో కార్మికుల్లో 80మందికి కరోనా

బెంగళూరు,జూలై14(ఆర్ఎన్ఎ): కర్ణాటక రాజధాని బెంగళూరులో కరోనా కేసుల తీవ్రత పెరిగిపోతూనే ఉంది. తాజాగా బెంగళూరు మెట్రో ఫేజ్-2 పనులు చేస్తున్న కార్మికులకు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. మొత్తం 200 మంది కార్మికుల్లో 80 మందికి కరోనా సోకినట్లు బెంగళూరు మెట్రో రైలు కార్పొరేషన్ లిమిటెడ్ అధికారి తెలిపారు. వీరందరిని కొవిడ్ కేర్ సెంటర్‌కు తరలించామని చెప్పారు. మెట్రో పనులు చేస్తున్న ఓ ఉద్యోగికి కరోనా రావడంతో.. అప్రమత్తమై టెస్టులు చేయగా కార్మికులకు ఈ వైరస్ వ్యాపించినట్లు తేలింది. దీంతో బెంగళూరు మెట్రో ఫేజ్-2 పనులను నిలిపివేశారు. మిగతా కార్మికు లందరూ కరోనా పట్ల జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. కర్ణాటకలో ఇప్పటి వరకు 41,581 పాజిటివ్ కేసులు నమోదు కాగా, 759 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం పాజిటివ్ కేసుల్లో 24,569 కేసులు యాక్టివ్ గా ఉన్నాయి. 16,249 మంది ఈ వైరస్ నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు.

చరిత్రలో నేటినిజం

కం॥ చిత్రపటము గనినమా
త్రోతులకును పొందనట్టి వరములియుండో
కే.కామరాజు గాలికే...
కాకలు తీరినఘనునకు కైమోడ్పిడెదన్!!

(జులై 15 కే. కామరాజ్ జయంతి..)

-రాధశ్రీ
సెల్: 9494481210

ప్రైవేటీకరణతో పెరుగుతున్న నిరుద్యోగం

నేటినిజం
బుధవారం 15-7-2020

దేశంలో ప్రజల అవసరాలకన్నా ప్రభుత్వం తన అవసరాలను గుర్తించి పనిచేస్తోంది. కరోనాతో ప్రజలంతా బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నా..ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయి ప్రజలు నానాయాతన పడుతున్నా వారిని ఆదుకునే ప్రయత్నాలు ఏ మాత్రం జరగడం లేదు. కరోనా దెబ్బతో సామాన్య పేద,మధ్య తరగతి ప్రజలు రోడ్డు పడ్డారు. వారికి ఉపాధి దక్కడం లేదు. ప్రైవేటీకరణలతో మరింత నిరుద్యోగం పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. దేశంలో యువత ఆశలపై నీళు చల్లుతూ పోతున్నారే తప్ప వారికి భరోసా కల్పించడం లేదు. కరోనాతో దేశంలో ఏం జరుగుతుందో పట్టించుకోవడం పక్కన పెట్టారు. ఆయా రాష్ట్రాల బిజెపి నాయకత్వాలు కూడా ప్రజల బాధలను పక్కన పెట్టి రాష్ట్రాల్లో ఉన్న బిజెపియేతర ప్రభుత్వాలపై యుద్ధం చేస్తున్నాయి. బ్యాంకులకు వెళితే ఎలాంటి రుణాలు ఇవ్వడానికి అధికారులు మొగ్గు చూపడం లేదు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తాననినరేంద్ర మోడీ యువతకు హామీ ఇచ్చారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వలన ఎన్ని లక్షలు, కోట్ల ఉద్యోగాలు పోయాయో లెక్కలేదు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులో ఏర్పడిన లక్షల ఖాళీలను నింపకుండా మోడీ మభ్యపెట్టే పథకాలతో ఇంతకాలం కాలయాపన చేస్తూ వచ్చారు. ఇలా యువతకు ద్రోహం చేశారు. అలాగే ఇప్పుడు తాజాగా కరోనా కారణంగా సామాన్యులంతా రోడ్డు పడ్డారు. వారికి బియ్యం పప్పులు పంపిణీ పేరుతో సాయం ప్రకటించినా మిగతా జనాల గురించి పట్టించుకోవడం లేదు. రైల్వేలో సుమారు 3లక్షల ఖాళీలను నింపకుండా యువతకు అన్యాయం చేయడమే గాకుండా రైళ్ళను ప్రైవేటుపరం చేయడంలో మోడీనాయకత్వం శ్రద్ధ చూపుతోంది. లక్షల కోట్లకు పడగ లెత్తిన కొద్ది మంది స్వార్థం కోసం అమలవుతున్న పథకాలు పూట తిండికి గతిలేని కోట్లాది జనం లక్ష్యంగా సాగడం లేదు. దేశ ప్రజల దౌర్భాగ్యాన్ని కరోనా కళ్ళకు కట్టినట్లు చూపెట్టింది. అభివృద్ధి సాధించామంటూ గొప్పలు చెప్పుకునే వారికి కనువిప్పు కలిగించింది. కనీసం మాస్కులు కూడా గతి లేకుండా పోయాయి. కిట్లు కూడా ఇప్పటికీ లేవు. టెస్టు కిట్లు కూడా ప్రైవేట్ రంగం ఆజమాయిషీలో ఉన్నాయి. విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. ఇకపోతే బొగ్గుగనులు, రైల్వేల ప్రైవేటీకరణలతో నిరుద్యోగం మరింతగా పెరగగలదు. ఇది తెలిసీ మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు మొగ్గు చూపడం దారుణం కాక మరోటి కాదు. ఇప్పటికే విదేశాల్లో ఉద్యోగాలు పోయాయి. కువైట్ లాంటి దేశాలు అక్కడ కూలీలుగా పనిచేస్తున్న లక్షల మంది భారతీయులను వెనక్కి పంపుతున్నారు. మోడీ ఆరేళ్ల పాలనలో రైలు చార్జీలు భారీగా పెంచినా ఈ దేశ పేద ప్రజల ప్రయాణానికి రైలే దిక్కు. బతుకుదెరువు కోసం వందలు, వేల కిలోమీటర్ల దూరం వలసలు వెళ్లే పేదజనంపై మోడీ గొడ్డలి వేటు వేశారు. ప్రజల రైలును కార్పొరేట్లకు కట్టబెట్టడం కారణంగా ఎంత మందిపై ప్రభావం పడుతుందో అధ్యయనం చేస్తే బాగుండేది. ప్రైవేట్ వాళ్లు అప్పనంగా అన్నీ సౌకర్యాలతో ఉన్న రైలెక్కి ముక్కుపిండి చార్జీలు వసూలు చేసి, ఉన్న ఉద్యోగులను మెల్లగా బయటకు తోసేసి లాభాలు గడించడం ఖాయం. ప్రజల నుండి వసూలు చేసిన పన్నుల డబ్బుతో రైలు పట్టాలు వేసి సిగ్నళ్లు బిగించి, స్టేషన్లు నిర్మించింది ప్రైవేట్ వాళ్లను బతికించడానికా అన్నది ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం దారుణం. ప్రజలు నిర్మించుకున్న రైలు పట్టాలపై ప్రైవేట్ రైళ్లు నడిపేందుకు మోడీ ఆదేశం ఇచ్చేశారు. రైళ్ళ నిర్వహణ కూడా ప్రజాధనంతోనే జరుగనున్నా.. రైళ్లు మాత్రం ప్రైవేటు పరం కానున్నాయి. లాభాలు వచ్చే రూట్లను ప్రైవేటుకు అప్పగించారు. నష్టాలు వచ్చే రూట్లలో భారత రైల్వే నడుపుతుంది. నష్టాలు తెచ్చే గ్రామీణ టెలిఫోన్ లైన్ల బాధ్యత బిఎస్ఎన్ఎల్ కు, లాభాలు ఇచ్చే మొబైల్ లైన్లను ప్రైవేటు ఆపరేటర్లకు కేటాయించారు మోడీ. లాభాలు ప్రైవేటుకు, నష్టాలు భారత ప్రజలకు

అన్నరీతిలో బిజెపి తీరు ఉండడం బాధాకరం. రైళ్లను ప్రైవేటుపరం చేయడంతో ఏకంగా రిజర్వేషన్లు కూడా దక్కక ఆయా వర్గాలు తీవ్రంగా నష్టపోనున్నాయి. స్థిరమైన, భద్రత గల ఉద్యోగాలకు పాతరేశారు. రైల్వే రూట్లకు లైసెన్సులు పొందిన ప్రైవేటు కంపెనీలు ఆ రూట్ల లైసెన్సులు చూపించి ప్రభుత్వ బ్యాంకుల దగ్గర అప్పులు పొందుతాయి. వాటితో నష్టాలను చూపడం తరవాత..ఎగవేయడం సర్వసాధారణంగ ఆమారనుంది. ప్రభుత్వ బ్యాంకుల నుండి లక్షల కోట్లు అప్పులు తీసుకున్న కథలు అందరికీ తెలిసిందే. బ్యాంకుల దగ్గర తీసుకున్న అప్పులు కట్టకుండా ఎగనామం పెట్టారు. రేపు రైళ్ళ ప్రైవేటు ఆపరేటర్లూ అదే చేయరన్న గ్యారెంటీ లేదు. టెలికం రంగంలో ఏం జరిగిందో గుర్తు చేసుకుంటే తతంగమంతా కళ్లకు కనిపిస్తుంది. బిఎస్ఎల్ ఎలా దివాళా తీసిందీ తెలుసుకుంటే మంచది. ప్రైవేట్ కంపెనీలు ప్రవేశించిన ప్రతి ప్రభుత్వ రంగంలోనూ ఇదే జరిగింది. రైల్వేలో కూడా అందుకు భిన్నంగా జరుగుతుందనుకోలేం. బ్రిటిష్ వలస పాలనలో బ్యాంకులు, ఇన్సూరెన్స్ అంతా ప్రైవేట్ వారివే. భారత ప్రజల డబ్బు తినేసి బోర్డులు తిప్పేసి ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా సాగాయి. స్వాతంత్ర్యానంతరం షిప్పింగ్, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికమ్యూని కేషన్లు, పోస్టల్, ఎయిర్‌లైన్లు అన్నిటినీ ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నది. దాంతో ప్రజల డబ్బుకు భద్రత ఏర్పడింది. ఉద్యోగాలకు భద్రత కలిగింది. లోపాలున్నా ప్రజలకు చౌకగా సరుకులు, సర్వీసులు అందుబాటులోకి తెచ్చింది. ప్రభుత్వరంగ పరిశ్రమల నిర్మాణంతో స్వావలంబన దిశగా దేశం నడిచింది. 1991 తరువాత తిరిగి ప్రైవేటీకరణ మొదలయ్యాక మళ్లీ ఒక్కో రంగం కుదేలవుతూ వస్తోంది. బొగ్గు, బాక్సైట్, గ్యాస్, చమురు...మొత్తం ప్రకృతి వనరులు, పోర్టులు, ఎయిర్‌లైన్స్, రైళ్లు, రోడ్డు, టెలికం వంటి మౌలిక సదుపాయాలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ వంటి ఆర్థిక సంస్థలు...చివరికి అంతరిక్షం, రక్షణ రంగాన్ని కూడా విదేశీ పెట్టుబడికి ఇచ్చేస్తే ఇక స్వావలంబన ఎక్కడ సాధ్యమో పాలకులు గమనించాలి. యువతను నిర్వీర్యం చేసేలా ఉపాధిలేకుండా చేస్తూ పోతే దేశంలో అశాంతికి కారణం కాగలదు. నిరుద్యోగం మరింతగా పెరగగలదు. ఈ దుస్థితి వల్ల దేశంలో అశాంతి చెలరేగే ప్రమాదం లేకపోలేదు. వీటన్నిటిని బేరీజు వేసుకుని ప్రభుత్వాలు ముందుకు సాగాలే తప్ప ...చేతులు దులిపేసుకునే నిర్ణయాలు సరైనవి కావని గుర్తించాలి.

ఎట్టకేలకు ఆస్పత్రికి వరవరరావు

ముంబై,జూలై14(ఆర్ఎన్ఎ): ముంబైలోని జైలులో ఉన్న విరసం నేత వరవరరావును మహారాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఆసుపత్రికి తరలించింది. అనారోగ్యం నుంచి వరవరరావు పూర్తిగా కోలుకునే వరకు ఆసుపత్రిలోనే ఉంచాలన్న ప్రొఫెసర్ హరగోపాల్ విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం గత రాత్రి ముంబైలోని జేజే ఆసుపత్రికి తరలించింది. తీవ్ర అస్వస్థతకు గురైన వరవరరావు గతంలో ఇదే ఆసుపత్రిలో చికిత్స పొందారు. అయితే ఆయన పూర్తిగా కోలుకోకుండానే గత నెల 1న డిశ్చార్జ్ చేశారు. వృద్ధాప్యంలో తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వరవరరావును కేంద్ర ప్రభుత్వం తప్పుడు కేసుల్లో ఇరికించారని,ఆయనను అమానుషంగా జైలులో నిర్బంధించిందని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తాత్కాలిక బెయిల్ కోసం వరవరరావు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. కరోనా వ్యాప్తి పెరుగుతుండడంతోపాటు తన ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తున్న దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని ఆయన కోరారు. వరవరరావుకు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ జూన్ 26న ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఒక పిటిషన్, వరవరరావు మెడికల్ రికార్డులను అందజేసేలా నవీ ముంబైలోని తలోజా జైలు అధికారులను ఆదేశించాలని కోరుతూ మరో పిటిషన్ వేశారు.

కరోనా నిబంధనలు బేఖాతర్

ఫలహారబండి ఊరేగింపులో పద్మారావు

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): కరోనా నిబంధనలను డిప్యూటి స్పీకర్ పద్మారావు గౌడ్ ఉల్లంఘించారు. బహిరంగ బోనాల ఉత్సవాలను ప్రభుత్వం అనుమతించకపోయినప్పటికీ.. తన నివాసం ముందుకు వచ్చిన ఫలహారం బండి ఊరేగింపులో పద్మారావు పాల్గొన్నారు. ఇటీవలే కరోనా బారినపడి చికిత్స పొందిన పద్మారావు గత వారం ఇంటికి చేరుకున్నారు. ఇప్పుడాయన హోం క్వారంటైన్‌లో ఉన్నారు. అయితే మంగళవారం మాస్క్ లేకుండా.. భౌతిక దూరం పాటించకుండా బోనాల ఉత్సవాల్లో పద్మారావు పాల్గొనడం చర్చనీయాంశమైంది. సాక్షాత్తు డిప్యూటీ స్పీకర్ ఇలా వ్యవహరించడంపై నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. గతంలో రాష్ట్రం మంత్రి కేటీఆర్ పర్యటనలో ఉండగా, స్వయంగా కేటీఆర్ మాస్క్ ఇచ్చినా పెట్టుకోకుండా పద్మారావు అలాగే జనంలో తిరిగారు. ఈ విషయాన్ని ఓ సభలో కేటీఆర్ ప్రస్తావించడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కరోనా విషయంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్న విషయం తెలిసిందే.

అదనపు కట్నం కోసం వేధింపులు

-ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న గృహిణి

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): అదనపు కట్నం వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య చేసుకుంది. యాదాద్రి జిల్లా వలిగొండ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన ధనలక్ష్మి(27)కి, చిట్యాల మండలం, వెలిమినేడు గ్రామానికి చెందిన పబ్బు గోపాల్‌కు 13 ఏళ్ల క్రితం వివాహం అయింది. వివాహ సమయంలో 10 తులాల బంగారం, రూ. 5 లక్షలు ఇచ్చారు. భార్యాభర్తలు ఇద్దరూ హయత్‌నగర్ ఇన్నర్మేషన్ కాలనీలో ఉంటున్నారు. అదనపు కట్నం తీసుకురావాలంటూ గోపాల్ భార్యను కొన్నేళ్ల నుంచి వేధిస్తున్నాడు. ధనలక్ష్మి పుట్టింటి వారు వలిగొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కొద్ది రోజులు బాగానే ఉన్న అతడు తర్వాత వేధింపులు ప్రారంభించాడు. పదిరోజుల క్రితం భార్యను కొట్టగా ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆమె తల్లిదండ్రులు 4 తులాల బంగారం, లక్ష రూపాయలు ఇచ్చి ధనలక్ష్మిని భర్త వద్దకు పంపించారు. మూడు రోజుల క్రితం గోపాల్, అతడి అన్న పెట్టయ్య ఆమెను అదనపు కట్నం తీసుకురావాలని మళ్లీ సతాయించారు. మనస్తాపం చెందిన ధనలక్ష్మి ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుంది. మృతురాలి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ పోలీసులకు సుప్రీం నోటీసులు

-మహిళా ఉద్యోగి ఆత్మహత్యకేసులో జారీ

సంగారెడ్డి,జూలై14(నేటినిజం ప్రతినిధి) మహిళా ఉద్యోగి ఆత్మహత్య కేసులో తెలంగాణ పోలీసులకు, సీబీఐ అధికారులతోపాటు బీహెచ్ఈఎల్ యాజమాన్యానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. గతేడాది అక్టోబర్‌లో బీహెచ్ఈఎల్‌లో ఉన్నతస్థాయి అధికారుల వేధింపుల కారణంగా నేహా చౌస్కి అనే ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఉద్యోగ సంస్థలో పై అధికారుల వేధింపుల కారణంగానే తను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నేహా సుసైడ్ నోట్‌లో రాశారు. ఈ క్రమంలో కూతురు ఆత్మహత్యపై సీబీఐ విచారణ కోరుతూ నేహా తల్లిదండ్రులు సుప్రీం కోర్టును ఆదేశించారు. ఈ నేపథ్యంలో సుసైడ్‌నోట్‌లో ఉన్న ఎనిమిది మందిని మియాపూర్ పోలీసులు ఎందుకు విచారణ జరపలేదని అత్యున్నత ధర్మాసనం జారీ చేసిన నోటీసులో పేర్కొంది. అదే విధంగా లేఖలో ఉన్న బీహెచ్ఈఎల్ అధికారులు, ఇతర ఉద్యోగులపై కూడా యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకుందనే విషయంపై వివరణ ఇవ్వాలని ఆదేశించి చింది. ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్న మహిళపై అధికారుల వేధింపులపై ఫిర్యాదు అందినా సీబీఐ ఎందుకు స్పందించలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది.

ఢిల్లీలో అందుబాటులోకి మరో ప్లాస్మా సెంటర్

ప్రారంభించిన సిఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ,జూలై14(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని ఢిల్లీలో కోవిడ్-19 రోగుల కోసం రెండో ప్లాస్మా సెంటర్ అందుబాటులోకి వచ్చింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్, ఉపముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఇతర ఉన్నతాధికారులతో కలిసి మంగళవారం ఈ సెంటర్‌ను ప్రారంభించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న లోక్‌నాయక్ హాస్పటల్‌లో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కేజీవ్రాల్ మాట్లాడుతూ, మేం పెట్టిన మొదటి ఎ÷-లాస్మా సెంటర్ విజయవంతమైంది. అందుకే రెండో సెంటర్‌ను ఎల్ఎన్‌జీపీ వద్ద ఈరోజు ప్రారంభించాం అని ట్వీట్ చేశారు. ఈ ఆసుపత్రిలో ముగ్గురు ప్లాస్మా స్వీకరణ కోసం ముగ్గురు కౌన్సిలర్లను నియమించారు. వీరు కోవిడ్ వైరస్ నుంచి కోలుకున్న వారికి ప్లాస్మా థెరపీ గురించి వివరించి, వారిని ప్లాస్మా దానం చేయడానికి ఒప్పిస్తారు. మొదటిసారి ప్రారంభించిన సెంటర్ విజయవంతం కావడంతో రెండో సెంటర్‌ను మంగళవారం ప్రారంభించారు. ఢిల్లీలో కరోనా నుంచి కోలుకుంటున్న వారి సంఖ్య 80శాతంగా ఉంది. ఇప్పటి వరకు ఢిల్లీలో 113,740 కరోనా కేసులు నమోదయ్యాయి.

కార్పొరేట్ ఆస్పత్రుల దాష్టీకంపై చర్యలేవీ ?

ప్రభుత్వ వైద్యం బలోపేతంపై దృష్టి పెట్టని పాలకులు

కరోనా బాధితులకు సత్వర వైద్యం అందాలి

న్యూఢిల్లీ,జూలై14(ఆర్ఎన్ఎ): మన దేశంలో కోవిడ్-19కు వైద్యం చేస్తున్నది ప్రభుత్వ ఆసుపత్రులే అధికం. తొలిదశలో ప్రైవేట్ ఆస్పత్రులను దగ్గరకు రానీయని ప్రభుత్వాలు ఇప్పుడు వారికి కూడా చికిత్సలు చేసే అవకాశం రావడంతో డబ్బులు గుంజడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాయి. నిజానికి వైద్యం అందిచడంలో ప్రైవేటు ఆసుపత్రులు పలాయనం చిత్తగించాయనే చెప్పాలి. కార్పొరేట్ ఆసుపత్రులు వైద్యం చేసినా రోగులను దోచేస్తున్నాయి. తమ దగ్గరున్న శాస్త్రసాంకేతికతను చూసుకుని కరోనా అంటే తమకు లెక్కలేదని అమెరికా అహం ప్రదర్శించింది. అక్కడ వున్నది ప్రైవేటు వైద్యం కావడంతో దారుణ పరిస్థితిని ఎదుర్కొంటోంది. చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా వంటి సోషలిస్టు దేశాల్లో వున్నది ప్రభుత్వ వైద్యం కావడం వల్లనే కారోనాను అదుపులో పెట్టగలిగాయి. తిండికి గతి లేని, చదువుకు నోచుకోని, వైద్యానికి దిక్కులేని స్థితి దాపురించినా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రపంచమంతా కరోనా వ్యాధితో... సంబంధిత అనంతర, అనుబంధ పరిణామాలతో అట్టుడి కిపోతోంది. ప్రతివారికి బతుకు ఒక సమస్య. బతుకుతెరువు ఒక పెద్ద సమస్య. ఉద్యోగాలు లేక, ఉపాధులు లేక దినం గడవడం కష్టమైపోయి నానాయాతనలు పడుతున్నారు. ప్రభుత్వాలే పూర్తి జీతాలు ఇవ్వటంలేదు. ఇక మిగతా సంస్థల సంగతి సరేసరి. అయినా ఇటువంటి విపత్కర పరిస్థితులలో కూడా కొందరు ధన సముపార్జన మార్గాలను అన్వేషిస్తున్నారు. మొదట కొంతకాలం వరకు ప్రభుత్వ ఆధ్వర్యం లోని ఆసుపత్రులలో కరోనా రోగులకు పరీక్షలు, చికిత్సలు, క్వారంటైన్లు ఉచితంగా ఏర్పాటు చేశారు. తరువాత కొన్నిచోట్ల ప్రభుత్వాలే రుసుములు వసూలు చేస్తున్నాయి. తరువాత కాలంలో వ్యాధిగ్రస్థుల సంఖ్య విపరీతంగా పెరిగిఎోవటంతో, ప్రభుత్వ వైద్యశాలల్లో వైద్యులు, వసతులు సరిపోవకపోవటంతో ప్రైవేట్ వైద్యశాలలకు కూడా చికిత్స అనుమతులు ఇచ్చారు. దాంతో అప్పటివరకు మూతపడి ఆవురావురుమంటున్న ప్రైవేటు వైద్యశాలలు ఇంక విజృంభించి వసూళ్ళు ప్రారంభించాయి. వేలల్లో, లక్షల్లో వసూలు చేస్తున్నాయని వార్తలు వస్తూ ఉన్నాయి. ఆ డబ్బులు కట్టనివాళ్ళకు, కట్టలేనివాళ్ళకు వ్యాధి తగ్గినాగాని ఇంటికి పంపించటంలేదు. ఒకవేళ రోగి చనిపోతే ఆ శవాన్ని బంధువులకు అప్పగించటం లేదని కూడా వార్తలు వస్తున్నాయి. ఎంత అమానవీయ ఘటనలు జరుగుతున్నా పెద్దగా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇటువంటి విపత్కర పరిస్థితులలో ప్రభుత్వాలు ఉదాసీన వైఖరిని వీడి సత్వర చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలే కరోనా రోగులందరికీ ఉచిత, సమగ్ర చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలి. చికిత్సా కేంద్రాలను, వైద్యులను, వైద్య సదుపాయాలను పెంచాలి. ప్రైవేటు వైద్యశాలలలో కూడా ఉచిత చికిత్సలు ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ ఆసుపత్రులపై సంపూర్ణ, కఠిన నిబంధనావళిని అమలు చేయాలి.

కరోనా నేపథ్యంలో పిల్లలపై తీవ్ర ప్రభావం

-బాలకార్మికులుగా మారుతున్న పేద పిల్లలు

హైదరాబాద్,జూలై13(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో పిల్లలు ఎక్కువగా ప్రభావితమయ్యారని తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ అభిప్రాయపడింది. ముఖ్యంగా బాల కార్మికులకు సంబంధించి పట్టణ, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న పిల్లలు వివిధ రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ జె. శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. పేద కుటుంబాలు ఎక్కువగా పిల్లలను ఆదాయాన్ని జోడించమని ఒత్తిడి చేయడం వల్ల బాల కార్మికులుగా మారుతున్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రంలో బాలకార్మికుల విభిన్న సమస్యలను పరిష్కరించడంలో కార్మికశాఖకు కీలక పాత్ర ఉందని అన్నారు. బాల కార్మికుల నిర్మూలనకు తీసుకోవల్సిన చర్యలపై బాలల హక్కులపరిరక్షణ కమిషన్ కార్మిక శాఖకు కొన్నిసిఫారసులు చేసిందని ఆయన వెల్లడించారు. ఇందులో బాలకార్మికుల కోసం రాష్ట్రంలోని అన్నిజిల్లాల్లో జిల్లా టాస్క్‌ఫోర్స్‌లను ఏర్పాటు చేయాలని సూచించింది. ఉమెన్ అండ్‌చైల్డ్ వెల్ఫేర్ , పోలీస్, సివిల్‌సొసైటీ అర్గనైజేషన్ వంటి వివిధ సంబంధిత లైన్ విభాగాలతో కలిసి బాల కార్మికుల పై సమయ, పరిమితి , క్రమబద్ధమైన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించింది. పత్తివిత్తనాలు, ఇటుకబట్టీలు, హోటళ్లు, దాబాలు, బీడీ రోలింగ్ , గృహ పనుల్లో బాల కార్మికులు ఎక్కువగా ఉన్నారు. దీనిపై దృష్టిపెట్టాలని సూచించింది. కన్‌స్ట్రక్షన్స్ బోర్డు, అనధికారిక వర్కర్స్ బోర్డు సభ్యులైన కార్మికుల పిల్లల కోసం పథకాలు, కార్యక్రమాలను అభివృద్ధి చేయాలని సూచించింది. పిల్లలు, యువత విద్య కొనసాగించేందుకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రో గ్రామ్‌లతో సహా నిర్దిష్ట సహాయ కార్యక్రమాలను రూపొందించడం, అమలుచేయడం అవసరమని సూచించింది.

గూగల్ సిఇఒ శ్రీ సుందర్ పిచాయి తో సంభాషించిన ప్రధాన మంత్రి

న్యూ ఢిల్లీ, జులై 14:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ గూగల్ సిఇఒ శ్రీ సుందర్ పిచాయి తో ఈ రోజు న వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా సంభాషించారు.

కోవిడ్-19 ని గురించి విశ్వసనీయమైన సమాచారాన్ని అందించడం కోసం మరియు కోవిడ్ పట్ల జాగృతి ని వ్యాప్తి చేయడం కోసం గూగల్ చేపట్టిన ప్రయత్నాలను ప్రధాన మంత్రి కి శ్రీ పిచాయి వివరించారు. ప్రధాన మంత్రి తీసుకొన్న లాక్ డౌన్ అమలు వంటి బలమైన చర్య ప్రపంచవ్యాప్త వ్యాధి కి వ్యతిరేకం గా భారతదేశం సాగిస్తున్న యుద్ధం లో చాలా దృఢమైన పునాది ని వేసిందని ఆయన అన్నారు. దుష్ప్రచారం తో తలపడడం లో, అవసరమైన ముందుజాగ్రత్తల విషయం లో సమాచారాన్ని చేరవేయడం లో గూగల్ అత్యంత సచేతనభరిత పాత్ర ను పోషించిందంటూ ప్రధాన మంత్రి మెచ్చుకొన్నారు. ఆరోగ్య సంరక్షణ సేవల ను అందించడం లో సాంకేతిక విజ్ఞానం తాలూకు లాభాల ను ఇప్పటి కంటే మరింత ఎక్కువ గా వినియోగించుకోవడాన్ని గురించి కూడా ఆయన ప్రస్తావించారు.

భారతీయులు సాంకేతిక విజ్ఞానాన్ని శర వేగం గా అనుసరిస్తున్నారని, సాంకేతిక విజ్ఞానానికి అనుగుణం గా వారిని వారు మలచుకొంటున్నారని ప్రధాన మంత్రి అన్నారు. సాంకేతిక విజ్ఞానం నుండి రైతులు లాభపడుతుండడాన్ని గురించి, ఆర్టిఫిశల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ద్వారా వ్యవసాయాని కి విస్తృత శ్రేణి ప్రయోజనాలు దక్కేందుకు ఉన్నటువంటి అవకాశాల ను గురించి ఆయన మాట్లాడారు. రైతుల తో పాటు విద్యార్థులు కూడా ఉపయోగించుకోదగ్గ వర్చువల్ లేబ్స్ ఆలోచన ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. దేశం లో గూగల్ యొక్క నూతన ఉత్పత్తులను మరియు గూగల్ యొక్క నవీన కార్యక్రమాల ను ప్రధాన మంత్రి దృష్టి కి శ్రీ సుందర్ పిచాయి తీసుకు వచ్చారు. బెంగళూరు లో ఎఐ రిసర్చ్ లేబ్ ను ప్రారంభించడాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. అలాగే వరద సంబంధిత గూగల్ ముందస్తు అంచనా ప్రయాస ల తాలూకు ప్రయోజనాల ను గురించి కూడా శ్రీ పిచాయి వివరించారు.

భారతదేశం లో ఒక భారీ పెట్టుబడి నిధి ని ప్రారంభించాలని, భారతదేశం లో వ్యూహాత్మకమైన భాగస్వామ్యాల ను అభివృద్ధిపరచాలని గూగల్ ప్రణాళికలు వేసుకొన్నట్లు ప్రధాన మంత్రి కి తెలియజేయడం జరిగింది. ప్రపంచం లో అత్యంత బాహాటమైన ఆర్థిక వ్యవస్థల లో భారతదేశం ఒకటి గా ఉందని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. వ్యవసాయం లో సంస్కరణలు తీసుకు రావడం కోసం ప్రభుత్వం ఇటీవల చేపట్టిన చర్యల ను గురించి, ఇంకా నూతన ఉద్యోగాల ను సృష్టించడం కోసం చేపట్టిన ప్రచార ఉద్యమాన్ని గురించి కూడా ఆయన మాట్లాడారు. అలాగే, కార్మికుల కు నవీన నైపుణ్యాల ను సంతరించడానికి ప్రాముఖ్యం ఇవ్వవలసిన అంశాన్ని గురించి సైతం ఆయన ప్రముఖం గా ప్రస్తావించారు.

తొలినాళ్లలో రష్యా చేయూతతో నిలబడ్డ పరిశ్రమలు

నేడు అవే పరిశ్రమలు ప్రైవేటీకరణతో తీవ్ర నష్టం

న్యూఢిల్లీ,జూలై14(ఆర్ఎన్ఎ): భారత ఆర్థిక స్వావలంబనకు కృషి జరిగిన తొలినాళ్లలో రష్యా అందించిన సాయం అంతా ఇంతా కాదు. భిలాయ్‌లో హిందూస్థాన్ స్టీల్ లిమిటెడ్, బొకారోలో ఇనుము ఉక్కు కర్మాగారం ఏర్పాటుకు సోవియట్ యూనియన్ చేయూతనందించింది. చమురు, సహజ వాయువు, ఉక్కు వంటి అనేక రంగాల్లో రష్యా కీలక సహకారమందించింది. ప్రభుత్వ రంగంతోనే స్వయం సమృద్ధి సాధ్యపడుతుందన్న స్ఫూర్తితో నాటి మన పాలకులు కూడా అనేక సంస్థలను జాతీయం చేశారు. ఏకంగా 14 బ్యాంకులను, జీవిత బీమా సంస్థను ప్రయివేటు చేతుల్లో నుంచి ప్రభుత్వ రంగ సంస్థలుగా మారాయి. మహా మాంద్యాలు ముంచెత్తినా, ఆర్థిక సంక్షోభాలు అర్రులు చాచినా మన ఆర్థిక వ్యవస్థ నిలదొక్కుకుందంటే దానికి ఏకైక కారణం ప్రభుత్వ రంగ బలమే.దేశంలో ఇంధన భద్రత కోసం 1970లో బొగ్గు గనులను జాతీయం చేశారు. విద్యుత్ వంటి అత్యంత కీలక రంగాలకు ప్రధాన వనరుగా ఉన్న బొగ్గు గనులను ప్రయివేటుకు అప్పగించడంతో పెద్దగా ప్రయోజాలను పొందలేదు. భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బిఎస్ఎన్ఎల్), ఎయిర్ ఇండియా, జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి)ల వాటాల విక్రయానికి అనుమతించారు. స్వాతంత్ర్యానంతరం ఆ సమయంలో సోవియట్ రష్యా నేనున్నాంటూ ముందుకొచ్చింది. కరోనా విపత్తు సమయంలోనూ పేదలను ఆదుకోకుండా 'ఆత్మ నిర్భర భారత్' పేరుతో రూ.20 లక్షల కోట్ల నిధులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టారు. వినాశకర విధానాలను, నయవంచనలపైను కార్మికులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.

బొగ్గు గనుల ప్రైవేటీకరణను ప్రతిఘటిస్తున్న కార్మికులకు అండగా దేవమంతా నిలవాలి. సంఘటిత ఉద్యమాలతో ప్రజల సంపదను, ప్రభుత్వ రంగాలను పరిరక్షించుకోవాలి.

అంతుచిక్కని కెసిఆర్ నిర్ణయాలు

విపక్షాల ఎజెండకు చిక్కని వైనం

విపక్షాలకు ఎప్పుడూ ఎజెండా ఫిక్స్ చేసేలా కార్యాచరణ

కెసిఆర్ ఎత్తులతో చతికిల పడుతున్న విపక్ష పార్టీలు

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నిర్ణయాలు ఎప్పుడూ అనూహ్యంగానే ఉంటాయి. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ఆరేల్ల పాల

రాష్ట్రంలో దూకుడు పెంచిన బిజెపి

అధికార టిఆర్ఎస్‌తో డైరెక్ట్ ఫైట్

కరోనా, నల్లపోచమ్మ ఆలయాల కూల్చివేతపై పోరు

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): ఎన్నికలకు మరో మూడేళ్లపైనే కాలం ఉంది. అయినా విపక్షాలతో పాటు బిజెపి కూడా దూకుడుగా వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో పాగా వేయాలన్న లక్ష్యంగా కార్యాచరణతో సాగుతోంది. వరంగల్‌లో జరిగిన తాజా ఘటనలు చూస్తుంటే ముమ్ముందు బిజెపి మరింత దూకుడు ప్రదర్శించే అవకాశాలు లేకపోలేదు. నలుగురు ఎంపిల్లో ఒకరు కేంద్రమంతరి కాగా మిగతా ముగ్గురు తమ కార్యకలాపాలతో ముందుకు సాగుతున్నారు. అర్వింద్, బండి సంజయ్‌లు ఇటీవల చురుకుగా పావులు కదుపుతున్నారు. ఇక సోయం బాపూరావు గిరజన సమస్యలు ఎజెండాగా పోరాడుతున్నారు. మొత్తంగా ఏదో ఒక సమస్యపై బిజెపి పోరాటం చేస్తోంది. కరోనా విషయంతో పాటు, సచివాలయంలో నల్లపోచమ్మ ఆలయం కూల్చివేత ఘటనలను తనకు అవకాశంగా మల్చుకోవాలని చూస్తోంది. సచివాలయం ఆవరణలోని నల్లపోచమ్మ ఆలయం కూల్చివేసి సీఎం కేసీఆర్ హిందువుల మనోభావాలను దెబ్బతీశారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తదితరులు చేసిన విమర్శలు ఇందుకు ఉదాహరణ. ఒక ఆలయాన్ని తరలించడం లేదా పున:ప్రతిష్ఠించాలంటే నిష్ఠ, పవిత్రతో సంప్రదాయబద్ధంగా కొనసాగించాల్సి ఉంటుందన్నారు. అలాంటిది ఉన్నపళంగా కూల్చివేయడం ఎలాంటి సంకేతాలు ఇస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, నగరంలోని పోచమ్మ ఆలయాల వద్ద కొబ్బరికాయలు కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సచివాలయంలో ఆలయం తిరిగి నిర్మించాలని, కూలగొట్టినవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వరంగల్‌లో బెదిరింపులకు పాల్పడుతున్న టీఆర్ఎస్ నాయకులకు తమ జిల్లాపార్టీ నాయకత్వం దీటైన జవాబు ఇచ్చిందని, ఇందుకు వారిని అభినందిస్తున్నానని బండి సంజయ్ తెలిపారు. టీఆర్ఎస్ నేతలు దమ్ము, ధైర్యం లేక పోలీసు పహరాలో కాలం వెళ్లదీస్తునారన్నారు. వరంగల్‌లో పార్టీ కార్యాలయం, ఎంపీ అర్వింద్‌పై టీఆర్ఎస్ శ్రేణులు చేసిన దాడిని పార్టీ తీవ్రంగా తప్పుపట్టింది. మరోవైపు, నల్లపోచమ్మ ఆలయం కూల్చివేతతో ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయని సైఫాబాద్ ఎస్‌హెచ్‌వోకు ఎమ్మెల్సీ ఎన్.రాంచంద్రరావు ఫిర్యాదు చేశారు. ప్రజలకు సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక కరోనాపై సర్కార్ నిర్లక్ష్యంగా ఉందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా విమర్శలకు దిగారు. అవసరమైన సాయం అందించినా ఉపయోగించుకోవడం లేదన్నారు. గవర్నర్‌కు బిజెపి నేతలు ఫిర్యాదు చేయడం, ఆమె కూడా అధికారులను పిలిచి సమీక్షించడం అంతా బిజెపి ఎజెండాలో భగాగంగానే చూడాలి. తొలుత నిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన గవర్నర్, ఆ తర్వాత గాంధీ ఆస్పత్రికి వెళ్లాలనుకున్నారు. హైదరాబాద్‌లో వైరస్ విజృంభించడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, ఆరోగ్య శాఖ కార్యదర్శిని తన వద్దకు రావాలని గవర్నర్ ఆదేశించారు. రాజ్యాంగం ప్రకారం ముఖ్య మంత్రులకు తెలియజేసిన తర్వాత అధికారులను పిలిపించుకునే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. అయితే, రాజకీయ కారణాలవల్ల గవర్నర్లు కొన్ని సందర్భాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. మొత్తానికి గవర్నర్ తమిళిసై నిర్ణయంతో బీజేపీ-టీఆర్ఎస్ మధ్య ప్రత్యక్షపోరుకు తెరతీసారా అన్న అనుమానాలు కూడా వచ్చాయి. దీనికితగ్గట్లుగా బీజేపీ నాయకుల మాటలలో పదును పెరగగా, అధికార పార్టీ వాళ్లు కూడా అదే స్థాయిలో ఎదురుదాడి మొదలుపెట్టారు. ఊహ్రష్ట్రంలో అధికారంలోకి వచ్చినా, రాకపోయినా వచ్చే ఎన్నికల్లో తెలంగాణ నుంచి కనీసం అరడజను లోక్‌సభ సీట్లు గెలుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు అనుగుణంగానే బీజేపీ రాష్ట్ర నాయకులు దూకుడు పెంచారని భావించాలి. అయితే కెసిఆర్ ఈ విషయంలో నాలుగాకులు ఎక్కువే చదివారు. కాంగ్రెస్, బీజేపీలలో ఏ ఒక్క పార్టీ కూడా మరీ బలపడకుండా ఎత్తుగడలు అమలు చేస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షాల మధ్య అనైక్యత కేసీఆర్‌కు బాగా కలిసొస్తోంది. మంత్రి కేటీఆర్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. ఎంపిలు,ఎ మ్మెల్యేలు, మంత్రులు కూడా కెటిఆర్ నాయకత్వాన్ని అంగీకరిస్తున్నారు. అందుకే ఆయన కూడా విమంశలు లెక్క చేయకుండా ఆయన సమీ క్షలు, సమావేశాలతో తీరిక లేకుండా ఉన్నారు. మొత్తంగా బిజెపి అధికార పార్టీని ఎదుంస్యేవడంలో నానా తంటాలు పడుతోంది.

విశాఖ రాంకీ ఫార్మా అగ్నిప్రమాదంపై విచారణ కమిటీ

ప్రమాదంలో ఒకరు మృతి..మరోకరికి తీవ్ర గాయాలు

వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశాలు

విశాఖపట్నం,జూలై14(ఆర్ఎన్ఎ): విశాఖ పరవాడ ఫార్మా సిటీలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం కారణంగా ఇప్పటి వరకు ఒకరు చనిపోయారు. రాంకీ కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు సాల్వెంట్ పరిశ్రమలో సోమవారం రాత్రి 10:20 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయని, మిగతా వారంతా క్షేమంగా ఉన్నారని జిల్లా కలెక్టర్ వినయ్‌చంద్, పోలీసు కమిషనర్ ఆర్‌కే మీనా తెలిపారు. విశాఖ సాల్వెంట్ కంపెనీ ఫార్మా కంపెనీ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలను శుద్ధి చేసి తిరిగి ఫార్మా కంపెనీలకు విక్రయిస్తుంటుంది. వ్యర్థాలను శుద్ధి చేసే క్రమంలో కంపెనీలో ఉన్న ఐదు కాలమ్‌లలో ఒక కాలమ్‌లో పేలుడు జరిగి, మంటలు ఎగసిపడ్డాయి. ఆ సమయంలో కెమిస్టులు మల్లేష్ (42), మనోజ్, శ్రీనివాస్, సెక్యూరిటీ గార్డు చిన్నారావు మాత్రమే లోపల ఉన్నారు. పేలుడుకు మల్లేష్‌కు గాయాలయ్యాయి. మిగతా వారంతా సురక్షితంగా బయటకు వచ్చేశారు. మల్లేష్‌ను గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే జిల్లా యంత్రాంగం సంఘటన స్థలానికి చేరుకుంది. అదే సమయంలో కుండపోత వర్షం కురవడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందలేదు. అగ్నిమాపక శాఖకు చెందిన 5 ఫైర్ ఇంజన్లు, రాంకీ కంపెనీకి చెందిన మూడు ఫైరింజన్లు రెండున్నర గంటల్లో మంటలను అదుపు చేశాయి. సంఘటన గురించి తెలిసిన వెంటనే ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని, సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి స్పందించారు. అధికారులను అప్రమత్తం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, విశాఖ ఆర్డీవో కిషోర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

విచారణ కమిటీ ఏర్పాటు

పరవాడ ఫార్మాసిటీలో రోజుల వ్యవధిలోనే మరో ప్రమాదం జరగడాన్ని జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణిస్తోంది. కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంపై కలెక్టర్ వినయ్ చంద్ నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేశారు. ప్రమాదంపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కమిటీ సభ్యులని ఆదేశించారు. డై మిథైల్ సల్ఫాక్సైడ్ వల్ల భారీ మంటలు ఏర్పడ్డాయని, ప్రమాదంపై పూర్తి విచారణ జరుపుతున్నామని కలెక్టర్ వినయ్ చంద్ అన్నారు. వరుస ప్రమాదాల నేపథ్యంలో మరోసారి జిల్లా స్థాయిలో సమీక్ష నిర్వహించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పరవాడ ఘటనపై విశాఖ ఆర్డీఓ, విచారణ కమిటీ సభ్యుడు కిషోర్ మాట్లాడుతూ.. పరవాడ సాల్వేషన్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై విచారణ చేస్తున్నాం. వాల్వ్ దగ్గర శాంపిల్ కలెక్షన్ చేస్తున్న సమయంలో ఏర్పడిన విద్యుత్ స్పార్క్ వల్ల ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా. డై మిథైల్ సల్ఫాక్సైడ్ లాంటి ప్రమాదకరమైన రసాయనాలను వాడే చోట కనీస అవగాహన లేని వారిని నియమించుకున్నారు. ప్రమాదంపై ఎలా స్పందించాలో ప్రజలని రక్షించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రమాద ఘటనలో ఒకరు మరణించారు. మంటలను పూర్తిగా అదుపు చేయడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ప్రమాద స్థలంలో రక్షణ పరికరాలు అందుబాటులో లేకపోవడం, రక్షణ పరికరాలు ఉపయోగించ డంలో కూడా అవగాహన లేకపోవడాన్ని గుర్తించామన్నారు. ఈ తరహా ప్రమాదాలు ఇకపై జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని విచారణ కమిటీ సభ్యుడు కిషోర్ తెలిపారు. ఫార్మా సిటీలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక కార్మికుడు చనిపోయినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాంకీ సాల్వెంట్ ఫాక్టరీలో రాత్రి 10.30 ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించగా.. కార్మికుడు శ్రీనివాసరావు అగ్నికి ఆహుతయ్యాడు. గాయాలపాలైన మరో కార్మికుడు మల్లేష్‌ను గాజువాకలోని ఆస్పుపత్రి తరలించారు. ప్రమాద సమయంలో అక్కడ మొత్తం ఆరుగురు కార్మికులు ఉన్నారు. మిగతా కార్మికులు సురక్షితంగా ఉన్నట్టు జిల్లా అధికారులు తెలిపారు. ఉదయానికల్లా మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని వెల్లడించారు.

టీఆర్ఎస్‌లో చేరిన ఇతర పార్టీ కౌన్సిలర్లు

మేడ్చల్ మల్కాజ్‌గిరి,జూలై14(ఆర్ఎన్ఎ): టిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్శితులై పలువురు పార్టీలో చేరుతున్నారని మంత్రి మల్లారెడ్డి అన్నారు. కెసిఆర్ నాయకత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. ఇతర పార్టీలకు చెందిన పలువురు కౌన్సిలర్లు మంగళవారం టీఆర్ఎస్ పార్టీలో చేరారు. మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీకి చెందిన ఇతర పార్టీ కౌన్సిలర్లు మంత్రి మంత్రి మల్లారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. కౌన్సిలర్లు పాండు, హరిబాబు, ఉమా ఆంజనేయులు టిఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి వీరికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. మేడ్చల్ నియోజకవర్గం శామీర్ పేట్ మండలం చంద్రపురి కాలనీకి చెందిన కిషోర్ కు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరు అయిన చెక్కును మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అభివృద్ధిలో తెలంగాణ దూసుకుని పోతోందని అన్నారు. ప్రజలకు అనేక విధాలుగా అండగా నిలిచిన ఘనత సిఎం కెసిఆర్‌దని మంత్రి అన్నారు.

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా తూముకుంట మున్సిపాలిటీకి చెందిన ఇతర పార్టీ కౌన్సిలర్లు మంత్రి మల్లారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరిన దృశ్యం

కరోనాతో బెంగాల్లో డిప్యూటి కలెక్టర్ మృతి

కోల్‌కతా,జూలై14(ఆర్ఎన్ఎ): పశ్చిమ బెంగాల్ కరోనా వైరస్ విజృంభణ కొనసాగుతూనే ఉంది. హుగ్లీ జిల్లాలోని చందన్ నగర్ సబ్ డివిజన్‌కు చెందిన డిప్యూటీ కలెక్టర్ దేబ్ దత్తారాయ్(38) కరోనాతో కన్నుమూశారు. ఈ నెల మొదటి వారంలో ఆమెకు కరోనా లక్షణాలు బయట పడటంతో.. హోం క్వారంటైన్ లో ఉండాలని వైద్యులు సూచించారు. దీంతో ఆమె ఇంటికే పరిమితం అయ్యారు. ఆదివారం ఉదయం డిప్యూటీ కలెక్టర్‌కు శ్వాస సంబంధ సమస్యలు తలెత్తాయి. ఈ క్రమంలో రాయ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం అందిస్తుండగా సోమవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కరోనా సమయంలో హుగ్లీ జిల్లాకు రైళ్లల్లో వచ్చిన కార్మికులను క్వారంటైన్ కు తరలించే బాధ్యతను దేబ్ దత్తా రాయ్ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఆమెకు కరోనా సోకి ఉండొచ్చని వైద్యులు పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్ మృతి పట్ల బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సంతాపం తెలిపారు. మృతురాలి భర్త, నాలుగేళ్ల కుమారుడికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

ఫార్మా ప్రమాదంలో కార్మికుడి మృతి

అనాధలైన ఇద్దరు పిల్లలు

విశాఖపట్నం,జూలై14(ఆర్ఎన్ఎ): విశాఖ పరవాడ ఫార్మా సిటీలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక కార్మికుడు చనిపోయినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాంకీ సాల్వెంట్ ఫాక్టరీలో రాత్రి 10.30 ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం సంభవించగా.. కార్మికుడు శ్రీనివాసరావు అగ్నికి ఆహుతయ్యాడు. శ్రీనివాసరావు మృతితో ఆయన కుటుంబంలో విషాదం నెలకొంది. ఇటీవల ఆయన భార్య చనిపోవడంతో ఇద్దరు పిల్లలతో శ్రీనివాసరావు తన సోదరి ఇంట్లో నివాసం ఉంటున్నాడు. అనకాపల్లి సమీపంలోని రేబాక వద్ద నివాసముంటున్న శ్రీనివాసరావు రాత్రి షిఫ్ట్‌లో డ్యూటీకి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో అతని కోసం తోటి ఉద్యోగులు గాలించగా కనిపించలేదని చెప్పారు. మంగళవారం ఉదయం శిథిలాల మధ్య కనిపించిన మృతదేహాన్ని పరిశీలించగా అది శ్రీనివాసరావుదిగా ఉద్యోగులు గుర్తించారని భోరుమన్నారు. తండ్రి మృతితో అతని ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. శ్రీనివాసరావు తల్లి (80) కూడా ఆధారాన్ని కోల్పోయినట్టయింది. కంపెనీలో ఉద్యోగానికి వెళ్లిన తన సోదరుడు తిరిగిరాని లోకాలకు వెళ్లాడని శ్రీనివాసరావు సోదరి కన్నీరు మున్నీరైంది.

ఫార్మా ప్రమాదంపై మంత్రుల ఆరా

-సమాచారం తెలుసుకున్న జయరాం, సుచరితలు

విశాఖపట్నం,జూలై14(ఆర్ఎన్ఎ): విశాఖ పరవాడ ఫార్మా సిటీలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక కార్మికుడు చనిపోయినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కార్మికుడు శ్రీనివాసరావు అగ్నికి ఆహుతయ్యాడు. గాయాలపాలైన మరో కార్మికుడు మల్లేష్‌ను గాజువాకలోని ఆస్పుపత్రి తరలించారు. ప్రమాద సమయంలో అక్కడ మొత్తం ఆరుగురు కార్మికులు ఉన్నారు. మిగతా కార్మికులు సురక్షితంగా ఉన్నట్టు జిల్లా అధికారులు తెలిపారు. ఉదయంవరకల్లా మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయని వెల్లడించారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ప్రమాదం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన కార్మికులకు తగిన వైద్య సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన కార్మికుడికి మెరుగైన వైద్యం కోసం విశాఖకు తరలించినట్లు అధికారులు మంత్రికి తెలిపారు. పరవాడ ఫార్మా కంపెనీ లో ప్రమాదం ఘటనపై విచారణకు ఆదేశించామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ప్రాథమిక విచారణ నివేదిక అనంతరం ప్రమాద కారణాలు తెలుస్తాయని చెప్పారు. ఫార్మాసిటీలో జరిగిన పేలుడు ఘటనపై హోంమంత్రి మేకతోటి సుచరిత తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు. సంబంధిత అధికారులు, పోలీసుల నుంచి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. స్థానికులు, సిబ్బందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని హోంమంత్రి సూచించారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అన్నారు. ఇక ప్రమాదం జరిగిన వెంటనే రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి స్పందించారు. అధికారులను అప్రమత్తం చేశారు. పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, విశాఖ ఆర్డీవో కిషోర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

అందుబాటులోకి వచ్చిన టిమ్స్

నేటినుంచి కరోనా పేషెంట్లకు చికిత్సలు

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): కోవిడ్ బాధితులకు కాస్త ఉపశమనం దొరికింది. కొవిడ్ రోగుల కోసం గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన టిమ్స్ ఆస్పత్రిని ప్రభుత్వం ఎట్టకేలకు ప్రారంభించింది. ఎలాంటి హడావుడి లేకుండా ఆస్పత్రిని ప్రారంభించారు. గత కొంత కాలంగా ఆస్పత్రి ప్రారంభంపై సందేహాలు వచ్చాయి. ఈ సందేహాలను నివృత్తి చేస్తూ సోమవారం హఠాత్తుగా ఆస్పత్రిని ప్రారంభించారు. నేటి నుంచి కోవిడ్ రోగులకు టిమ్స్ ఆసుపత్రి అందుబాటులోకి రానుంది. గచ్చిబౌలిలో నిర్మించిన ఈ ఆస్పత్రిలో 1500 మంది రోగులకు చికిత్స అందించే సామర్థ్యంతో నిర్మించారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ రిసెర్చి (టిమ్స్)గా తీర్చిదిద్దాలని సీఎం కేసీఆర్ గతంలో ప్రకటించారు. ఇందులో 750 సాధారణ పడకలుంటాయి. మరో 750 మిల్టీ స్పెషాలిటి పడకలను అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఆస్పత్రిలో 468 మంది డాక్టర్లు, 228 మంది నర్సులు, 578 మంది ఇతర వైద్య సిబ్బంది సేవలు అందిస్తారని అధికారులు చెబుతున్నారు. గచ్చిబౌలిలో 78 ఎకరాల్లో టిమ్స్‌ను నిర్మించారు.

15వరకు కూల్చివేతలను ఆపండి

సచివాలయకూల్చివేతపై హైకోర్టు తాజా ఆదేశాలు

ఆన్‌లైన్ క్లాస్‌లపై వివరాల సమర్పణకు ఆదేశం

హైదరాబాద్,జూలై13(ఆర్ఎన్ఎ): సచివాలయ భవనాల కూల్చివేతపై మళ్లీ ఆగింది. హైకోర్టు ఇప్పటికే కూల్చివేతలను తొలుతు ఆపాలని ఆదేశించిన కోర్టు సోమవారం కూడా మరోమారు రెండురోజులపాటు కూల్చివేతలను ఆపాలని ఆదేశించింది. ఈ నెల 15 వరకు ఆపాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సచివాలయ భవనాల కూల్చివేత పిటిషన్ పై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. భవనాల కూల్చివేత అనుమతులపై ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ దాఖలు చేసింది. క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం షీల్డ్ కవర్‌లో సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. సాయంత్రం సమర్పిస్తామని అటార్నీ జనరల్ హైకోర్టుకు తెలిపారు. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్ పిటిషన్‌పై రిప్లై కౌంటర్ దాఖలు చేస్తామని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ పేర్కొన్నారు. తదుపరి విచారణను ధర్మాసనం ఈ నెల 15కు వాయిదా వేసింది.

ఆన్‌లైన్ క్లాసులపై వివరాలు సమర్పించండి..

ఆన్‌లైన్ క్లాసులకు ప్రభుత్వం ఎలాంటి అనుమతి ఇవ్వలేదని హైకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణపై హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. ఆన్‌లైన్ క్లాసులకు అనుమతి ఇవ్వకుండా ప్రైవేటు పాఠశాలలు ఎలా నిర్వహిస్తున్నాయి. వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుందని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం సీబీఎస్ఈ నిబంధనలు ప్రకారం కొన్ని పాఠశాలలు ఆన్‌లైన్ క్లాసులు నిర్వహిస్తున్నాయని ప్రభుత్వం తరపున ఏజీ హైకోర్టుకు తెలిపారు. ఆన్‌లైన్ క్లాసుల నిర్వహణపై ప్రభుత్వం చెప్పిన అంశాలపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆన్ లైన్ క్లాసులపై ప్రభుత్వ పాలసీ విధానం వారం రోజుల్లో చెబుతామని కోర్టుకు ప్రభుత్వం తెలిపింది.జూలై 31 వరకు విద్యా సంవత్సరం ప్రారంభం కాదని ప్రభుత్వం పేర్కొంది. ప్రభుత్వం వాదనలు విన్న ధర్మాసనం.. వచ్చే సోమవారం ఆన్‌లైన్ క్లాసులపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

నిర్మలా సీతారామన్‌లో వైవి భేటీ

న్యూఢిల్లీ,జూలై14(ఆర్ఎన్ఎ): కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కలిశారు. లాక్‌డౌన్ కారణంగా టీటీడీకి ఆదాయంపడిపోయిందని, కష్టాల్లో ఉన్న సంస్థను ఆదుకోవాలని కోరారు. టీటీడీ వద్ద ఉన్న పాత నోట్లను మార్పిడి చేయాలని, నోట్ల రద్దుతో 50 కోట్ల రూపాయలు టీటీడీ వద్దే ఉండిపోయాయని తెలిపారు. భక్తులు ఇచ్చే కానుకలను డబ్బు రూపంలో మార్చేందుకు అనుమతించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు, వెనకబడిన జిల్లాలకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని సుబ్బారెడ్డి కోరారు.

పాలమూరును అగ్రగామిగా నిలబెడతాం: కెటిఆర్

మహబూబ్‌నగర్,జూలై14(ఆర్ఎన్ఎ): వెనకబడిన పాలమూరు జిల్లాను తెలంగాణ అగ్రగామి జిల్లాగా మారుస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లో సోమవారం పర్యాటించిన మంత్రి ఈ సందర్భంగా జిల్లాలో ఎక్స్‌పో ప్లాజాను ప్రారంభించారు.

అనంతరం కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ... పాలమూరు జిల్లాపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని వ్యాఖ్యానించారు. జిల్లాలోని పట్టణాలు, గ్రామాలను అభివృద్ధి బాటలో నిలుపుతామన్నారు. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక జోన్‌లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమాన్ని నిరాటంకంగా చేస్తున్నామని తెలిపారు. దళారుల ప్రమేయం లేకుండా పథకాలు అమలు

చేస్తున్నామని ఉమ్మడి జిల్లాలో సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు నీరందిస్తామన్నారు. ప్రతిపక్షాల ఆరోపణలు పట్టించుకోవాల్సిన పని లేదని మంత్రి పేర్కొన్నారు.

ఎపిలో మారుతున్న రాజకీయ సమీకరణలు

-అధికార వైకాపా లక్ష్యంగా విమర్శలకు బిజెపి పదను

అమరావతి,జూలై14(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్‌లో కూడా తాజా రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. అధికార వైసీపీని విమర్శించే విషయంలో ఇప్పటివరకు ఆచితూచి వ్యవహరిస్తున్న బీజేపీ నాయకులు తాజాగా దూకుడుగా పోతున్నారు. విపక్ష టిడిపితో పాటు బిజెపి కూడా ఆయా విషయాల్లో విమర్శలకు దిగుతోంది. ఇటీవల వైకాపా అనేకానేక కార్యక్రమాలతో ప్రజలకు చేరువవుతోంది. దీంతో సెంటిమెంట్ అంస్త్రాలను బిజెపి బలంగా ముందుకు తీసుకుని పోతోంది. తిరుమల తదితర అంశాలను బాగా ఉపయోగించుకుంటోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇప్పటి వరకు అనేక అంశాలపై నేరుగా విమర్శలకు దిగుతున్నారు. టిడిపిలో ఉంటే వేధింపులు తప్పవని గ్రహించిన అనేకులు ఇప్పుడు బిజెపి ముసుగులో పోరాడాలని చూస్తున్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలకు ప్రత్యామ్నాయంగా బలపడాలని బీజేపీ నాయకులు కలలు కంటున్నారు. అయితే, బీజేపీలోని కొంతమంది నాయకుల వ్యాఖ్యల వల్ల రాష్ట్రంలో పార్టీ పెద్దగా బలపడలేదు. రాజధాని ఎక్కడ ఉండాలన్నది నిర్ణయించుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానిదేనని, కేంద్రం జోక్యం చేసుకోలేదని సునీల్ దేవధర్, జీవీఎల్ నరసింహారావు వంటి వారు గతంలో చేసిన ప్రకటనలు బిజెపిని దెబ్బతీసాయి. రాజధాని మర్చవద్దని కన్నా లక్ష్మీనారాయణ పోరాడుతంటే అందుకు భిన్నంగా బిజెపి నేతలు వ్యవహరించారు. వీరు చేస్తున్న ప్రకటనల వల్ల బీజేపీ పట్ల ప్రజల్లో సానుకూలత ఏర్పడటం లేదు. అయితే తెలుగుదేశం నుంచి చేరిన సుజనా చౌదరి ప్రభృతులను విజయసాయిరెడ్డి మిడతల దండుతో పోల్చడాన్ని బీజేపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. తమ పార్టీలోకి వచ్చేవారిని ఇలా కించపరచడాన్ని వారు తీవ్రంగా తప్పు పట్టారు. వైకాపా ఎంపి విజయసాయిరెడ్డిని నేరుగా విమర్శిస్తూ చెక్ పెట్టారు. తమ పార్టీ అంతర్గత విషయంలో తలదూర్చితే సహించబోమంటూ విజయసాయిరెడ్డికి హెచ్చరిక చేయడం గమనార్హం. సునీల్ దేవధర్‌లాంటి వాళ్లు కూడా

విజయ సాయిరెడ్డిపై ట్విటర్ వేదికగా దాడి చేసినవారిలో ఉండటం గమనార్హం.

రాష్ట్రంలో సొంతంగా బలపడాలని నరేంద్ర మోదీ, అమిత్ షాకు బలంగా ఉన్నప్పటికీ రాష్ట్ర నాయకులపై వారికి నమ్మకం కలగడం లేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వంపై తాము దూకుడు పెంచితే ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీ లాభపడుతుందన్న ఉద్దేశం కూడా బిజెపిలో ఉందన్న అపోహలు ఉన్నాయి. ముమ్ముందు బీజేపీ ఎటువంటి వైఖరి తీసుకుంటుందో తెలియదు. అయితే అధికార వైకాపాను గట్టిగానే ఎదుర్కోవాలని నిర్ణయించారు.

ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే వరుస ప్రమాదాలు

మృతుడి కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి

ప్రమాదాలపై విచారణకు ఆదేవించాలి: దేవినేని

విజయవాడ,జూలై14(ఆర్ఎన్ఎ): ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే విశాఖలోని కంపెనీల్లో వరుస ప్రమాదాలు జరుగుతున్నాయని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. విశాఖలోని పరవాడ రాంకీ ఫార్మాసిటీలోని సాల్వెంట్స్ కంపెనీలో జరిగిన ప్రమాదంపై ఆయన

బలమైన, స్థితిస్థాపక, " ఆత్మా నిర్భర్ భారత్ " కోసం, వాణిజ్య సంస్థలకు ఒక ముఖ్యమైన పాత్ర ఉంది: శ్రీ పియూష్ గోయల్

హైదరాబాద్, జులై 14:కోవిడ్-19 ప్రపంచాన్ని మార్చింది, కాని భారతీయ ప్రజలు, వ్యాపారాలు, పరిశ్రమలు ఈ సంక్షోభానికి లొంగలేదనీ, స్థితిస్థాపకత యొక్క ప్రత్యేకమైన లక్షణంతో నిలబడి, పరిస్థితిని ఎదుర్కోవటానికి ఈ సంక్షోభాన్ని అవకాశంగా మార్చుకోవడానికి ఇవి కొత్త మార్గాలను నిరంతరం అన్వేషిస్తున్నాయనీ, కేంద్ర వాణిజ్య, పరిశ్రమలు మరియు రైల్వేల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు న్యూఢిల్లీ లో పేర్కొన్నారు.

దేశంలో అతిపురాతనమైన సంస్థల్లో ఒకటైన, బొంబాయి వాణిజ్య మరియు పరిశ్రమల మండలి 184వ వార్షిక సర్వ సభ్య సమావేశంలో, ఆఫీసు బేరర్లు మరియు సభ్యులనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.

ఈ సందర్భంగా శ్రీ గోయల్ మాట్లాడుతూ, భారతదేశాన్ని స్వయం సమృద్ధిగా మరియు భారతదేశంలో కోవిడ్ పరిస్థితులతో పోరాడటానికి సిద్ధంగా ఉండటానికి, పి.పి.ఈ. లను ఉత్పత్తి చేయడం, ఐ.సి.యు. పడకలకు మౌలిక సదుపాయాలు కల్పించడం, ఐసోలేషన్ సదుపాయాలు, మాస్కులు, ఇతర పి.పి.ఈ.ల తయారీలో భారతీయ పరిశ్రమలు మరియు వాణిజ్య సంస్థల పాత్రను ప్రశంసించారు. భారతదేశం ఇప్పుడు పిపిఇలను ఎగుమతి చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉందని ఆయన పేర్కొన్నారు. అన్ లాక్ ప్రారంభమైన పరిస్థితుల్లో, సరకు రవాణా, విద్యుత్తు వినియోగం పెరగడంతో, భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా మెరుగుపడుతోంది. నహేతుకమైన స్థాయి నిర్వహణ కార్యక్రమాలతో తయారీ ప్రక్రియ ప్రారంభమైంది. ఎగుమతులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. కోవిడ్ కు ముందు మరియు కోవిడ్ తరువాత ప్రపంచాలు భిన్నంగా ఉంటాయనీ, కోవిడ్ తరువాత ఉత్తమమైన ప్రపంచానికి మనం సిద్ధమవుతున్నామని ఆయన పేర్కొన్నారు.

కోవిడ్ అనంతర ప్రపంచంలో, భారతదేశం ఒక దేశంగా, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని, ఉత్పత్తిని పెంచడం, ఉత్పత్తుల నాణ్యతను మెరుగుపరచడం, అధిక ఆర్థిక వ్యవస్థల కోసం ప్రయత్నించడం, సరకు రవాణా విధానాలు, పోటీ ధర మరియు వినూత్న పద్ధతులను ఉపయోగించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని శ్రీ గోయల్ సూచించారు. వృద్ధిని పెంపొందించడానికి, ఎక్కువ ఉపాధి అవకాశాలతో యువతకు ఉద్యోగాలు కల్పించడానికి, ప్రపంచంతో బలంగా నిమగ్నమవ్వడానికి, ప్రపంచానికి తలుపులు మూసివేయకుండా, భారతదేశాన్ని స్వయం సమృద్ధి "ఆత్మ నిర్భర్ భారత్" గా రూపొందించడానికి ప్రభుత్వం మరియు వాణిజ్య సంస్థలు కలిసి పనిచేయాలని, ఆయన పేర్కొన్నారు.

ఆటో విడి భాగాలు, తోలు ఉత్పత్తులు, ఔషధాలు, పాదరక్షలు, సముద్ర ఉత్పత్తుల వంటి నిర్దిష్ట రంగాలలో ప్రత్యేకత కలిగిన మన భారతీయ పరిశ్రమలు భారతీయ తయారీని ప్రోత్సహించే భారీ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. "వ్యాపార సూచికలను సులభతరం చేయడానికి మరియు సరళీకృతం చేయడానికి, పరిశ్రమల కోసం ఏక గవాక్ష అనుమతులు మరియు స్వీయ-నియంత్రణ నిర్మాణాలకు బలమైన యంత్రాంగాన్ని నిర్మించడానికి అనువుగా చేసే ప్రయత్నాలకు సహాయం చేయడానికి మరియు సహకరించడానికి బొంబాయి వాణిజ్య, పరిశ్రమల మండలిని నేను ఆహ్వానిస్తున్నాను" అని శ్రీ పియూష్ గోయల్ చెప్పారు.

బలమైన, స్థితిస్థాపక భారతదేశ నిర్మాణానికి, వాణిజ్య సంస్థలు ముఖ్యమైన పాత్ర పోషించవలసిన అవసరం ఉందని, శ్రీ గోయల్ అభిప్రాయపడ్డారు. దేశంలోని పురాతన వాణిజ్య సంస్థలలో ఒకటిగా ఉన్న బొంబాయి వాణిజ్య, పారిశ్రామిక మండలి 184వ సర్వ సభ్య సమావేశం ఒక ముఖ్యమైన సంఘటనగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. దేశంలోని యువత యొక్క అపారమైన సామర్థ్యాలను ఉపయోగించడం ద్వారా భారతదేశం ప్రపంచానికి నాయకత్వం వహించగలదని ఆయన తమ ప్రసంగాన్ని ముగిస్తూ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ పరీక్షా సమయాల్లో 130 కోట్ల మంది భారతీయుల స్థితిస్థాపకతను శ్రీ గోయల్ ప్రశంసించారు.

మరో ఇద్దరు జర్నలిస్టుల మృతి

నాగర్‌కర్నూలు ఆంధ్రజ్యోతి విలేకరి హఠాన్మరణం

గుండెపోటుతో ఉషోదయం ఎడిటర్ లాయక్ రషీద్ అలీఖాన్ మృతి

హైదరాబాద్,జూలై14(ఆర్ఎన్ఎ): వరుస మరణాలు జర్నలిస్టులను కలవరపరుస్తోంది. రెండురోజుల వ్యవధిలో మరో ఇద్దరు జర్నలిస్టులు మృత్యువాత పడ్డారు. ఆంధ్రజ్యోతి నాగర్ కర్నూల్ విలేకరి లక్ష్మినారాయణ మృతి చెందారు. అలాగే ప్రముఖ తెలుగు దినపత్రిక ఉషోదయం ప్రధాన సంపాదకులు, పబ్లిషర్ లాయక్ రషీద్ అలీఖాన్ (72) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. 1994 నుంచి ఆయన ఉషోదయం పత్రికను నడుపుతున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పత్రికారంగంలోనే కాకుండా పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లోనూ లాయక్ చురుకుగా పాల్గొనే వారు. ఆయన మృతికి ఉషోదయం సిబ్బంది సంతాపం ప్రకటించింది. జర్నలిస్టుల వరు మరణాల పట్ల తెలంగాణ జర్నలిస్ట్ జె.ఏ.సి సంతాపాన్ని తెలియజేస్తోంది.రాష్ట్రంలో జర్నలిస్టు మృతి కలచి వేస్తోందిన పేర్కొంది. ఇదిలావుంటే కరోనా కవరేజ్‌లో నిరంతరాయంగా పాల్గొంటున్న పలువురు జర్నలిస్టులు కరోనా బారిన పడుతున్నారు. వారు తమ వృత్తి ధర్మంలో భాగంగా జాగ్రత్తలు పాటించాలని జాక్ కోరింది. జర్నలిస్టులు ఎప్పటికప్పుడు ప్రజలకు కరోనా విషయాలను తెలియజేసి అప్రమత్తం చేయకుంటే, రాష్ట్రంలో కరోనా బాధితుల సంఖ్య రెట్టింపు ఉండేదని ప్రభుత్వం గుర్తించాలని జాక్ కన్వీనర్ దేవరకొండ కాళిదాస్ , కో కన్వీనర్, అవ్వారు రఘు పేర్కొన్నారు. జర్నలిస్టులకు ఆర్థిక సహాయం, జె.హెచ్.ఎస్ ద్వారా వైద్యం,50 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని వారు సిఎం కెసిఆర్‌ను కోరారు. అలాగే జర్నలిస్టులకు ఆరోగ్య,ఆర్థిక భద్రత కల్పించాలని అన్నారు.

రాజస్థాన్ కాంగ్రెస్‌లో ముదరిని సంక్షోభం

సచిన్ పైలట్ సమా ముగ్గురు మంత్రులపై వేటు

102మంది ఎంపిల బలముందంటూ కాంగ్రెస్ ప్రకటన

సిఎల్పీ సమావేశం గెహ్లోట్‌కు మద్దతు పలికిందని కాంగ్రెస్ వ్యాఖ్య

జైపూర్,జూలై14(ఆర్ఎన్ఎ): రాజస్తాన్ కాంగ్రెస్ రాజకీయం మలుపులు తిరుగుతోంది. రాజకీయ సంక్షోభం కీలక దిశగా పయనిస్తోంది. రెండోసారి కాంగ్రెస్ లెజిస్లేటివ్ పార్టీ భేటీకి డుమ్మా కొట్టిన ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పీసీసీ చీఫ్ సచిన్ పైలట్‌పై కాంగ్రెస్ వేటు వేసింది. సచిన్‌ను ఉప ముఖ్యమంత్రి పదవి, పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తున్నట్టు పార్టీ సీనియర్ నేత రణదీప్ సింగ్ సుర్జేవాల ప్రకటించారు. రాజస్థాన్ డిప్యూటీ సీఎం పదవి నుంచి సచిన్ పైలట్‌ను తొలగించినట్లు కాంగ్రెస్ పార్టీ తెలిపింది. అలాగే రాజస్థాన్ పీసీసీ చీఫ్ పదవి నుంచి కూడా ఆయనను తొలగించినట్లు ఆ పార్టీ సీనియర్ నేత రణదీప్ సుర్జేవాలా మంగళవారం ఢిల్లీలో చెప్పారు. ఆ స్థానంలో గోవింద్ సింగ్ దోతస్రాను నియమించినట్లు తెలిపారు. అలాగే సచిన్ పైలట్ వెంట ఉన్న ముగ్గురు మంత్రులను కూడా క్యాబినెట్ నుంచి తొలగించినట్లు ఆయన వెల్లడించారు. సచిన్ పైలట్, అతడి సహచరులు కొందరు బీజేపీ కుట్రలో చిక్కుకున్నారని, 8 కోట్ల మంది రాజస్థానీలు ఎన్నుకున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చివేసేందుకు కుట్ర చేస్తుండటాన్ని తాను చింతుస్తున్నానని రణదీప్ సుర్జేవాలా అన్నారు. ఇది ఆమోదయోగ్యం కాదన్న ఆయన, అందుకే వారిని మంత్రివర్గం నుంచి తప్పించినట్లు తెలిపారు. మరోవైపు మంగళవారం జైపూర్‌లోని ఫెయి ర్‌మౌంట్ హోటల్‌లో నిర్వహించిన సీఎల్పీ సమావేశానికి సచిన్ పైలట్ హాజరుకాలేదు. దీంతో ఆయనను పార్టీ నుంచి తొలగించాలని ఆ భేటీలో పాల్గొన్న 102 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సీఎం అశోక్ గహ్లోత్ నాయకత్వాన్ని బలపరిచిన ఎమ్మెల్యేల డిమాండ్‌తో కాంగ్రెస్ చర్యలు చేపట్టింది. సోమవారం జరిగిన మొదటి సమావేశంలో సైతం ఇదే సంఖ్యలో ఎమ్మెల్యేలు పాల్గొన్నట్లు ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ ప్రకటించారు. కాగా వరుసగా రెండు రోజు సమావేశానికి వందకు పైగా ఎమ్మెల్యేలు పాల్గొనడంతో రాజస్తాన్ ప్రభుత్వానికి వచ్చే నష్టమేం లేదనే ధీమాలో ఉన్నారు. వాస్తవానికి మెజారిటీ కావాల్సింది 101 మాత్రమే. కాంగ్రెస్ వద్ద అంత కంటే ఎక్కువే ఉన్నట్లు చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ రెబల్ నేత సచిన్ పైలెట్ తన వద్ద 30 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని చెబుత టున్నారు. ఇరు పక్షాల నంబర్లకు ఏమాత్రం పొంతన లేకుండా ఉంది. జైపూర్‌లోని ఫేయిర్‌మంట్ హోటల్‌లో జరిగిన సీఎల్పీ సమావేశానికి భారీ సంఖ్యలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. కాంగ్రెస్ చెబుతున్నట్లు 100కు పైగా ఉన్నారా లేదా అనే స్పష్టత ఇంకా రాలేదు.

కాళేశ్వరంతో తెలంగాణ సస్యశ్యామలం : మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్

జనగామ/మహమూబాబాద్, జులై 14: కాళేశ్వరం, ఎస్సారెస్పీ, దేవాదుల, పాలమూరు, రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణ సస్యశ్యామలం కానుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, గిరిజన సంక్షేమం, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లో మంగళవారం మంత్రులు విస్తృతంగా పర్యటించారు. జనగామ జిల్లా రామవరం, కొడకండ్ల, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు, అమ్మాపురం గ్రామాల్లో రైతు వేదికలకు శంకుస్థాపనలు చేశారు. అలాగే నాంచారి మడూరు గ్రామంలో మొక్కలు నాటి ప్రకృతి వనానికి శ్రీకారం చుట్టారు. అలాగే పలు చోట్ల హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. అలాగే రైతు వేదికలకు శంకుస్థాపన చేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ రైతులను రాజులను చేసేందుకు సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారని చెప్పారు. కరోనా కష్టకాలంలోనూ రైతులను ఇబ్బంది పెట్టకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. కరోనా మహమ్మారి క్రమంలో ధాన్యం కొనుగోలు ఒక్క తెలంగాణలో తప్ప దేశంలో ఎక్కడా జరుగలేదన్నారు. రూ.30వేల కోట్లతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన ఘతన కెసిఆర్‌దేనని చెప్పారు. రైతులకు సాగునీరు, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, రైతు వేదికలు, కల్లాలు, గోదాములు, అందుబాటులో విత్తనాలు, ఎరువులు, రుణమాఫీలు ఇలా అనేక పథకాలు కేవలం రైతాంగం కోసమే అమలు అవుతున్నాయని మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి చెప్పారు.

రైతు వేదికలతో దళారుల నుంచి విముక్తి

రైతుల వేదికల ఏర్పాటుతో అన్నదాతలకు దళారుల నుంచి విముక్తి కలుగుతుందని మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యానికి తామే ధరలు నిర్ణయించే పరిస్థితులు రావాలన్నారు. అన్నదాత బాగుంటే దేశం బాగుంటుందని, ఆ లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రతి 5వేల ఎకరాలకు క్లస్టర్ చొప్పున ఏర్పాటు చేసి, రైతు వేదికలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇలా జనగామ జిల్లాలోనే 62 రైతు వేదికలు నిర్మిస్తుండగా, ఇప్పటికే తొమ్మిదింటికి శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. కొడకండ్లలో 40వేల మెట్రిక్ టన్నుల గోదాం రూ.25 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు చెప్పారు.

సీఎం కేసీఆర్ రూపొందించిన పథకాలతో పల్లెలో ప్రగతి బాటలు పయనిస్తున్నాయని చెప్పారు. గతంలో ఎన్నడూ ఈ స్థాయి ప్రగతిని పల్లెల్లో చూడలేదన్నారు. తమ సుదీర్ఘ రాజకీయ జీవితంలో కేసీఆర్‌లాంటి సీఎంని కూడా చూడలేదని, నిరంతరం ప్రజలు, రైతులు, వారి సంక్షేమం, అభివృద్ధికి పరితపించే సీఎం మనకు ఉండడ మన అదృష్టమని మంత్రులు తెలిపారు. ఈ సందర్భంగా పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్లు పూర్తి చేసి, పాలకుర్తి నియోజకవర్గం మొత్తానికి సాగునీటిని, మంచినీటిని అందిస్తామని మంత్రి ఎర్రబెల్లి ప్రజల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

కరోనాతో జెర జాగ్రత్త!

కరోనాతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మరికొద్ది రోజులు ప్రజలు స్వీయ నియంత్రణ, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో జనగామ, మహబూబాబాద్ కలెక్టర్లు నిఖిల, గౌతం, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బక్రీద్ సందర్భంగా గోవధలు జరుగకుండా పటిష్ట చర్యలు

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్,జులై 14 (నేటినిజం ప్రతినిధి): బక్రీద్ సందర్భంగా గోవధలు జరుగకుండా పోలీస్‌శాఖ పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నదని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. చట్టానికి చుట్టాలంటూ ఎవ్వరూ ఉండరని, చట్టానికి వ్యతిరేకంగా గోవధలకు పాల్పడే,ప్రయత్నించే, అక్రమంగా సరఫరా చేసేవారందరిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాబోవు బక్రీద్, గణేష్ నవరాత్రోత్సవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు చర్యల్లో భాగంగా సోమవారం నాడు హిందూమతానికి చెందిన పెద్దలు, ప్రతినిధులతో కమిషనరేట్ కేంద్రంలోని పరేడ్‌గ్రౌండ్‌లో పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆవులు అక్రమంగా సరఫరా అవుతున్నాయంటూ అనుమానంసాకుతో బృందాలుగా ఏర్పడి అల్లర్లకు కారణమయ్యేవారిపై చర్యలు తప్పవన్నారు. ఆవుల అక్రమరవాణాకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే సంబంధిత పోలీసు అధికారులు, డయల్100లకు సమాచారం అందించినా వెంటనే సదరుప్రాంతానికి పోలీసులు నిమిషాలవ్యవధిలో చేరుకుని చర్యలు తీసుకుంటారని తెలిపారు. గతమూడు సంవత్సరాల నుండి కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా బక్రీద్ సందర్భంగా గోవధలు జరిగిన దాఖలాలులేవని స్పష్టం చేశారు. పోలీసులు ముస్లిమతపెద్దలు, ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించి పూర్తిగా గోవధలను నియంత్రించడం జరిగిందని వివరించారు. కమిషనరేట్‌లోని అన్నివర్గాలకు చెందిన ప్రజలు కుల, మత,వర్గవిభేదాలను విడనాడి కరీంనగర్ అంటే శాంతిసామరస్యానికి చిరునామాగా చెప్పుకునే స్థాయిలో నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ చర్యల్లో పోలీసులు సఫలీకృతం కావడం జరుగుతున్నదని తెలిపారు. కమిషనరేట్ ఏర్పాటుకుముందు జరిగిన సంఘటనల ద్వారా వివిధ మతాలమధ్య ఘర్షణలు జరిగేందుకు అవకాశాలు ఏర్పడిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని పోలీస్‌శాఖ పటిష్ట చర్యలను తీసుకుంటున్నదని చెప్పారు. కమిషనరేట్ పోలీసులు సిటిపోలీస్‌శిక్షణ కేంద్రం(సిపిటిసి)లో రెండు ఆవులను పెంచుతున్నదని, పోలీస్ శిక్షణ కళాశాలలో మూడు ఆవుల పెంపకంకోసం అనుమతి లభించి ందని, దీంతో ఆవులవట్ల పోలీస్‌శాఖ వహిస్తున్న శ్రద్ధను గుర్తించాలని చెప్పారు. యజమానుల నిర్లక్ష్యంతో రోడ్లపై వస్తున్న పశువుల నియంత్రణకు స్పెషల్‌డ్రైవ్‌లను కొనసాగిస్తున్నామని, తాను ఇటీవల కోర్టుప్రాంతంలో ఒక ఆవు వాహనం ఢీకునడంతో తీవ్రంగా గాయపడిన సంఘటనకు చలించి, వెంటనే బ్లూకోల్ట్స్, పెట్రోకార్ విభాగాలను అప్రమత్తం చేసి ఆసుపత్రికి తరలించిన సంఘటనను ఈ సందర్భంగా ఉదహరించారు. యజమానుల నిర్లక్ష్యంతో రోడ్లపైకి వస్తూ పశువులు ప్లాస్టిక్‌కవర్లను తింటూ ప్రాణాలు కోల్పోతున్నాయని చెప్పారు. పశువులనుపెంచుకుని హక్కు అన్నివర్గాల ప్రజలకు ఉందని, అనేకమంది జీవనోపాధి కోసమే పశువులను పెంచుతున్నారనే విషయం తమపరిశోధనలో తేలిందని తెలిపారు. ప్రస్తుతం నెలకుని ఉన్న విపత్కర పరిస్థితులు మరింతగా భయాందోళనలు చెందే విధంగా ఉద్భుతంగా వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గణేష్ నవరాత్రోత్సవాలను కూడా నిరాడంబరంగా జరుపుకునేందుకు ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మానసికంగా సిద్ధకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(ఎల్అండ్ఓ) ఎస్ శ్రీనివాస్, కరీంనగర్ టౌన్ ఏసిపి పి అశోక్, ఎస్‌బిఐ ఇంద్రసేనారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు విజయ్‌కుమార్, లక్ష్మణ్‌బాబు, విజ్ఞాన్‌రావు, ఆర్ఐ మల్లేశంలతోపాటుగా హిందూమతానికి చెందిన పెద్దలు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ పెండ్యాల శ్రీరామ్‌కు ఉపరాష్ట్రపతి అభినందన

కరోనా మృతుడిని ట్రాక్టర్‌లో తీసుకెళ్లిన తీరు స్ఫూర్తిదాయకం

న్యూఢిల్లీ,జూలై14(ఆర్ఎన్ఎ): పెద్దపల్లి జిల్లా వైద్యారోగ్యశాఖ సర్వైవ్‌లెన్స్ అధికారి డాక్టర్ పెండ్యాల శ్రీరామ్‌ను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అభినందించారు. ట్విట్టర్ ద్వారా ఉపరాష్ట్రపతి స్పందిస్తూ... కరోనా మృతుడి భౌతికకాయం తరలింపునకు మున్సిపాలిటీ డ్రైవర్ నిరాకరించడంతో స్వయంగా తానే

ట్రాక్టర్ నడిపి శ్మశానవాటికకు తీసుకెళ్లిన పెద్దపల్లి జిల్లా కరోనా నిఘా అధికారి డాక్టర్ పెండ్యాల శ్రీరాం గారి చొరవను అభినందిస్తున్నాను. వీరి చొరవ, అంకితభావం సమాజానికి స్ఫూర్తిదాయకం కావాలని పేర్కొన్నారు. పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడకు చెందిన 45 ఏండ్ల వ్యక్తికి కరోనా పాజిటివ్ అని తేలడంతో ఆదివారం పెద్దపల్లి జిల్లా ప్రధాన దవాఖానలో చేరాడు. ఐసోలేషన్ వార్డుకు తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోవడంతో ఆ రోజే ఉదయం 9.30 గంటల ప్రాంతంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినా రావడానికి ఎవ్వరూ ముందుకు రాలేదు. దీంతో మున్సిపల్ అధికారులు శవాన్ని తరలించేందుకు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. అయితే చనిపోయిన వ్యక్తి కరోనా పాజిటివ్ అని తేలడంతో వాహనం నడిపేందుకు ఆ ట్రాక్టర్ డ్రైవర్ సైతం నిరాకరించాడు. దీంతో వైద్యారోగ్యశాఖ జిల్లా సర్వైవ్‌లెన్స్ అధికారి డాక్టర్ పెండ్యాల శ్రీరామ్ మానవతా భృక్పదంతో ముందుకు వచ్చారు. ఇతర వైద్యుల సహకారంతో మృతదేహాన్ని ట్రాక్టర్‌లో వేసుకుని తానే స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ శ్మశానవాటికకు తీసుకెళ్లారు. కొవిడ్ నిబంధనల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. డాక్టర్ చూపిన మానవనవతపై సర్వత్రా సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

వాహనదారులకు కోట్లరూపాయల్లో జరిమానాలు విధించలేదు

కరీంనగర్,జులై 14 (నేటినిజం ప్రతినిధి) రోడ్డునియమనిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు కారణం అవుతున్న వాహనదారులకు కోట్లరూపాయలలో జరిమానాలు విధిస్తున్నట్లు ప్రచురితం వార్తాకథనాల్లో వాస్తవంలేదని తెలియజేస్తున్నాము. ఆన్‌లైన్ ద్వారా అందిన సమాచారం, వివిధ కేసుల్లో విధించబడినట్లు వచ్చిన మొత్తాన్ని లెక్కించడం జరిగిన పొరపాటుతో కొట్లరూపాయల్లో జరిమానాలు విధించినట్లు పేర్కొవడంలో జరిగిన చిన్నపొరపాటుతో పై విధంగా వార్త ప్రచురితం అయింది.

రోడ్డుప్రమాదాల నియంత్రణకోసం పోలీస్‌శాఖ పలుచర్యలను తీసుకుంటున్నదని, ఇందుకు బాధ్యులైన వారిపై జరిమానాలు విధిస్తున్న విషయం వాస్తవమేనని పేర్కొంటున్నాము. ఈ మొత్తం కోట్లరూపాయల్లో లేదని, వాహనాదారులకు ఇంతపరిమితిలో జరిమానాలు విధించాలంటూ కమిషనరేట్ పోలీస్‌శాఖ ఎలాంటి టార్గెట్లను పెట్టుకోలేదని స్పష్టం చేశారు. వాహనదారులందరూ రోడ్డునియమనిబంధనలు పాటించాలని కోరారు. ఈ మధ్యకాలంలో జరిగిన అనేక ప్రమాదాలు వాహనాదారుల నిర్లక్ష్యం కారణంగా జరిగాయని తెలిపారు. నిబంధనలు ఉల్లఘించిన వాహనదారులు భవిష్యత్‌లో ఇలాంటి చర్యలను పునరావృతం చేయవద్దనే

ఉద్దేశంతో జరిమానాలను విధిన్నామని తెలియజేస్తున్నాము. కరీంనగర్ కమిషనరేట్ వ్యాప్తంగా ఈ సంవత్సరం జనవరి నుండి జూన్‌వరకు రోడ్డునియమనిబంధనలు ఉల్లఘించిన వాహనదారులపై వివిధ రకాలకు సంబంధించిన 3,11,369కేసుల్లో జరిమానాలు విధించడం జరిగిందని వివరిస్తున్నాము.

పోలీస్‌శాఖకు సంబంధించి ఏవైనా వార్తలు ప్రచురించే సందర్భంలో ఎలాంటి అనుమానాలు తలెత్తినా సంబంధిత అధికారులను సంప్రదించి వివరణతీసుకుని ప్రచురించాలని కోరుతున్నాము. లెక్కించడంలో జరిగిన చిన్నపొరపాటుతో వాహనదారులు బెంబేలెత్తేవిధంగా వార్తాకథనాలు ప్రచురితం కావడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నాను. వాహనదారులందరూ రోడ్డునియమనిబంధనలు పాటించడంతోపాటు రోడ్డుప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యల్లో తమవంతు సహకారం అందించాలని కోరుతున్నాము

ఏఎస్ఐ కుటుంబానికి ప్రమాదభీమా చెక్కును అందించిన పోలీస్ కమిషనర్

సుల్తానాబాద్ ఏఎస్ఐ సుంకె రవి ఇటీవల విధులనుండి తిరిగివస్తుండగా బొమ్మకల్ శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. మంజూరు అయిన ఈ మొత్తాన్ని శాశ్వత అవసరాలకోసం వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి(పరిపాలన) జి చంద్రమోహన్, పోలీసు అధికారుల అసోసియేషన్ అధ్యక్షులు యం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్, జులై 14(నేటినిజంప్రతినిధి) ఇటీవల రోడ్డుప్రమాదంలో మృతి చెందిన సుల్తానాబాద్ ఏఎస్ఐ సుంకె తిరుపతి కుటుంబానికి పోలీస్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీద్వారా మంజూరు అయిన ప్రమాదభీమాకు సంబంధించిన 03లక్షల రూపాయల చెక్కును మంగళవారం నాడు కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి ఆయన భార్య సుంకె రాణికి అందజేశారు.

మాస్కులు పెట్టని వారి నుంచి కోటి జరిమానా వసూళ్లు

బెంగళూరు,జూలై14(ఆర్ఎన్ఎ): కరోనా కాలంలో మాస్క్ తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. మాస్క్ లేకుండా బయట తిరిగితే భారీ ఫైన్ వేస్తున్నారు. బెంగళూరు నగరంలో లాక్ డౌన్ అమలు చేస్తున్నారు. గత నెలరోజుల వ్యవధిలో మాస్క్ పెట్టుకోని వారి నుంచి ఏకంగా కోటి జరిమానా విధించారు. బెంగళూరు నగర వ్యాప్తంగా మాస్కులు లేని వారి నుంచి ట్రాఫిక్ పోలీసులు, బీబీఎంసీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. జూన్ నెలలో కోటి రూపాయల జరిమానా వసూలు చేసినట్టు అధికారులు ప్రకటించారు. మాస్కులు లేని వారు, భూతిక దూరం పాటించనివారు 50,706 మందిని గుర్తించి వారికి జరిమానా విధించారు.వీరి నుంచి రూ.1.91 కోట్లు వసూలు చేసింది. ఒక్కొక్కరికి రూ.200 చొప్పున జరిమానా విధించారు.

మాస్క్ పెట్టుకోనందుకు లాఠీ

కరోనా వైరస్ బారిన పడకుండా ఉండేందుకు ప్రతిఒక్కరూ మాస్కులు పెట్టుకోవాలని వైద్యులు, అధికారులు సూచిస్తున్నారు. అయినా ప్రజలు నిర్లక్ష్యంగానే ఉన్నారు. ఎవరైనా ఎన్నిరోజులు అని చెప్తారు. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా మాటవినడం లేదు. అందుకని ఓ పోలీస్ మాస్క్ పెట్టుకోలేదనే కారణంతో ఓ యువకుడిని చితకబాదాడు. అతనికి పోలీస్‌కు ఎలాంటి శత్రుత్వం లేదు. కేవలం మాస్క్ పెట్టుకోలేదనే కారణంతోనే ఈ సంఘటన జరిగింది.మధ్యప్రదేశ్‌లోని అలిరాజాపూర్‌లో కుటుంబంతో కలిసి బైకు వెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసు కానిస్టేబుల్ అడ్డుకున్నాడు. మాస్క్ ఎందుకు పెట్టుకోలేదని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం నెలకొంది. గొడవ కాస్త పెద్దదైంది. చుట్టుపక్కల వాళ్లు గొడవను ఆపకుండా మరింత సహకరించారు. ఒక ఆయన అయితే పోలీస్‌కు కర్ర అందించాడు. ఈ సంఘటన